


అయిదు గంటలయింది.

శ్రీపతి ఆఫీసునుంచి ఇంట్లో అడుగు పెడుతూనే బాత్‌రూమ్‌లోకి దూరాడు, కాఫీ అయినా తాగకుండ.

శకుంతల మనసులో లీలగా అనుమానం ప్రవేశించింది అలా వంట గదిలో కూర్చుండిపోయింది

శ్రీపతి స్నానం చేయటం అయింది కాబోలు. బెడ్‌రూమ్‌లోంచి కేకపెట్టాడు. "శకూ! కాఫీ తీసుకురా!" అని.

శకుంతల కాఫీ కప్పుతోపాటు అరిటికాయ బజ్జీలు ప్లేటు నిండుగా పెట్టుకు తీసుకు వచ్చింది.

"ఇప్పుడు బజ్జీలెందుకు? అనవసరం

శ్రమ; రెండేసి బజ్జీలు నోట్లో కుక్కుకుంటూ అడిగాడు శ్రీపతి.

"కృష్ణవేణి సినిమాకి వెళదామని వంటచేసి మీకోసం రెడీగా కూర్చున్నాను. మీదే ఆలస్యం. మీ కిష్టమైన బజ్జీలువేసి కాకాపడదామని చేశాను రెడీకండి హాలు దగ్గరేగా, నడచిపోవచ్చు. అన్నట్లు యీ సినిమా ఇవాళ్టితో ఆఖరుట "

శ్రీపతి గొంతు కష్టంగా వెలక్కాయ బదులు అరటికాయ బజ్జీ పడింది. కప్పు వేడికాఫీ రెండుగుక్కల్లో తాగి కంఠం సవిరిమ్చుకున్నాడు.

"సుందరం బర్త్ డే యీరోజు, పార్టీ ఇస్తున్నాను ఆఫీసునుంచి ఇటేవచ్చేయి అన్నాడు. శకూతో చెప్పి తప్పకవస్తానని మాట ఇచ్చి ఇలా వచ్చేశాను."

"మీ ఫ్రెండ్ సుందరం మనింటికి నాలుగయిదుసార్లు వచ్చాడు. నాకేం కొత్తలేదు అక్కడికి మీతో నన్నూతీసు కెళ్ళండి. లేకపోతే పిక్చర్ కన్నారండీ; శకుంతల కళ్ళార్పకుండా శ్రీపతిని చూస్తూ అంది.

"ఛా...ఛా... మొగాళ్ళ పార్టీకి నీవు రావటం ఏమిటి ? కావాలంటే నీ ఒక్కదానివీ వెళ్లు పిక్చర్ కి, అందులో అక్కడ నీవోటి..."

"ఊ...అక్కడ ఎవర్నయినాడాన్స్ చేయటానికి పిలిదారా ?" శకుంతల మధ్యలో అడ్డుతగిలి అంది.

. "అహ, అదికాదు..." నీళ్ళు నమిలాడు శ్రీపతి.

"అయితే ఏదో వుందన్నమాట..."

"ఛా...యీ మధ్య నీకు అనుమానం ఎక్కువయింది." ఇస్త్రీ పాంటు మడత విప్పుతు అన్నాడు.

"అనుమానం ఎక్కువకానటంకాదు. నిజం అయింది నన్ను సినిమాకన్నా తీసుకెళ్ళండి మీ ఫ్రెండ్ ఇంటికన్నా తీసుకెళ్ళండి " మొండిగా అంది శకుంతల.

శ్రీపతికి కోపంవచ్చింది. పైకి వ్యక్తం చేయకుండా చిరునవ్వు ముఖాన పులుముకున్నాడు. శకుంతల దగ్గరగా వచ్చి నడుంచుట్టూ చేతులు పోనిచ్చి దగ్గరకు లాక్కున్నాడు.

"శకూ ! మొగవాడు బైట తిరక్కచెడిపోతాడు. అవసరంవచ్చినప్పుడు వెళ్ళాలి. ఫ్రెండ్స్ పిలిస్తే పోవాలి ఆఫీసరు కబురంపితే హాజరుకావాలి ఎన్నో వుంటాయి. చీటికి మాటికి యిలా అనుమానం పడితే నేనేంచేయను చెప్పు!"

భర్త చేతులు బలవంతానా వదిలించుకొని దూరంగా జరిగింది శకుంతల.

"నా తలమీద చేయివేసి ప్రమాణం చేసి చెప్పండి మీరెక్కడికెళ్ళేది ?".

"ప్రమాణం చేయను. నమ్మితే నమ్ము నమ్మకపోతే మానేయి సుందరం బర్త్ డే పార్టీకి పోతున్నాను "శ్రీపతి బూటులేసులు చకచక ముడేసుకుంటూ అన్నాడు.

ఆ పార్టీ ఏదో నాకు తెలియక పోలేదు. మీ స్నేహితులంతా కలిసి ఓ మగువను ఏర్పాటుచేసుకుంటారు ఓ రాత్రి ఖుషీగా గడిపేస్తారు. దురల వాట్లు ఏమీ లేవని మురిసిపొయ్యాను. అన్నింటినీ మించిన పెద్ద అలవాటే వుంది. నాలో లోపంవుండి తిరిగినా అర్థం వుంటుంది. ఏ విషయంలో మీకు లోటు చేశాను ? చెప్పండి ?"

శకుంతల శ్రీపతికి అడ్డంగా నుంచుని భుజాలు పట్టుకు ఆవేశంగా వూపుతూ అడిగింది.

"నువ్వేం లోటు చేయలేదు శకూ ! నేమటుకు నీకేమన్నా లోటు చేశానా చెప్పు ? ఏ చీరకావాలంటే ఆ చీర. ఏ నగకావాలంటే ఆ నగ. నువ్వు కోరిన ప్రతి కోర్కె తీర్చాను. ఫ్రెండ్ ఇంటికి పార్టీకి వెళుతుంటే అడ్డుతగలటం ఏం బాగుండలేదు." శ్రీపతి సానునయంగా అన్నాడు.

"టీపార్టీ అయితే అడ్డుపెట్టేటంత మూర్ఖురాలిని కాదండీ. మగువపార్టీ. అదే నా బాధ మీకు నిద్దట్లో పైకి కలవ రించే అలవాటుంది. మీ ఫ్రెండ్స్‌తో మాట్లాడినప్పుడు విన్నాను పక్కింటి సరోజ ఎవరినో అన్నట్లు మీ గురించి వ్యంగ్యంగా అంది. మీ లాల్చీమీద కాటుక చారలు. బుష్‌షర్టుమీద లిఫ్‌స్టిక్ ముద్రలు. సెంటుపరిమళం మీ వంటి మీద. మీఉంగరాల జుట్టులో ఇరుక్కున్న మల్లెపూవు. మీ పార్టీకి గుర్తులు. ప్రమాణం చేయమంటే వెయ్యి వెనక్కు పోతున్నది. చెప్పండి. నా అనుమానం అబద్ధమే అంటారా ?" శకుంతల ఆవేశ పడిపోతూ అడిగింది.


"నువు · పొరపడుతున్నావంటే నమ్మవు ఎలా నమ్మించాలో నాకు తెలియటంలేదు. యీ ఒకసారికి వెళ్ళి వస్తాను. ప్లీజ్ అన్నాగా ! మా మంచి అమ్మాయి. నా మాట వింటుంది" శ్రీపతి, శకుంతల గడ్డంపట్టుకున్నాడు.

"మంచి అమ్మాయిని కాబట్టే, మీ నటనకి లొంగిపొయ్యాను. ఇహపై వినను, వినను. మీ యిష్టమొచ్చిన చోటికి మీరు పోండి. నా యిష్టమొచ్చిన చోటుకి నే పోతాను "

"గుడ్ గరల్, నేపోతే లోకం ఏమీ అనదు నువు పోతే లోకం కాకుల్లా పొడుస్తుంది ఆడవాళ్ళు గోరంతని కొండంతలుగా వూహించి తను బాధ పడేదిగాక ఎదుటివారిని బాధపెడతారు. నువ్వూ అంతేనోయ్!"

"ఇలా కబుర్లు చెప్పే యిన్నాళ్లూ మీ యిష్టమొచ్చినట్టు తిరిగారు. ఇవాళ వూరుకోను. తాడో పేడో తేల్చి నా కంఠం నొక్కి వెళ్ళండి." శకుంతల తలుపుకి అడ్డంగా నుంచుని అంది.

"నువ్వు మొండివయితే, నేను జగ




మొండిని శకూ ! నీ వంటిమీద చెయ్యి వేయటం, నీ కంఠం పిసకటం పొర పాటున కూడా చేయను. సుందరంతో వస్తానని మాట యిచ్చాను కాబట్టి వెళ్ళక తప్పదు. ఆడిన మాట తప్పటం నా కల వాటు లేదు." శకుంతల చెయ్యిపట్టుకు యివతలకు గుంజి తలుపుతీసుకుని బైటకు వెళ్ళిపోయాడు శ్రీపతి.

దృఢంగా ఎత్తుకు తగినలావుతోవుండే శ్రీపతి, శకుంతల సన్నటి నడుంచుట్టూ ఎడంచేయి పెనవేసి గిరగిర తిప్పేవాడు ఎన్నోసార్లు. శకుంతల మరోసారి శ్రీపతిని బైటకు పోనీయకుండా తలుపుకి అడ్డంనుంచున్నా ఎడంచేత్తో బొమ్మని ఎత్తినట్లు ఎత్తి పక్కనపెట్టి వెళ్ళగలడు శ్రీపతి.

అందుకే ఏం మాట్లాడలేక ఎదురు తిరగలేక అవాక్కయి నుంచుండి పోయింది శకుంతల. చక చక హుందాగా అడుగులేస్తు వెళుతున్న శ్రీపతినిచూస్తూ.

శ్రీపతి కనుమరుగయిందాకా చూచి నిస్పృహగా వచ్చి మంచంమీద కూల బడింది శకుంతల.

"వారు అన్నివిధాలా మంచివారే. యీ ఒక్క విషయంలో తప్ప. చెడు స్నేహమే యీవిషయంలో దారి తప్పించింది. ఏదడిగినా కాదనరు. పార్టీ విషయంతప్ప, పోనీ అని వూరుకోటానికి రేపు ఏ వగలాడో మత్తులిల్లిందంటే తాళికట్టి ఇంటికి తీసుకువచ్చినా తీసుకువస్తారు. అప్పుడు చింతించి

ప్రయోజనం లేదు మార్చాలి... మార్చాలి...ఎలా ?

వారు ఇంటికి వచ్చేటప్పటికి ఓ లెటర్ రాయాలి "నేను పుట్టింటికి పోతున్నాను మీరు మారి...నా అవసరం వుందని గ్రహించిననాడు యీ ఇంట్లో కాలు పెడతాను. అని" మారారే సరి లేకపోతే ఎవరిదారి వారిదే.

గడియారం "ఠంగ్, ఠంగ్," మంటూ ఆరుగంటలు కొట్టింది

శకుంతల ఉలిక్కిపడింది ఎవరో హెచ్చరించినట్లయి

"ఛా...ఛా... నేనే మాలోచిస్తున్నాను. వారన్నట్లు లోకులు కాకులు. వారిననరు, నన్నంటారు. నన్నన్నా భరవాలేదు. పుట్టింట్లో వుండటమే జరిగితే నన్నుకాదు అనేది. అమ్మను.... దేవతలాంటి అమ్మ నాగురించి మాట పడటమా ?

ఆ తల్లి కూతురుకాదూ ? ఎక్కడికి పోతాయి బుద్ధులు,అని అమ్మనే అంటారు. కష్టమో, సుఖమో,నాపాట్లునే పడతాను. నీకు మాటరానీయనమ్మా !

కణతలు నొక్కుకుంటు బాధగా అనుకుంది శకుంతల.

ప్రజ్వరిల్లే అగ్నిపర్వతాన్ని మనసులో సమాధిచేసి హిమం కప్పబడిన మేరుపర్వతంలా, జీవితాన్ని లాక్కొచ్చి కాలప్రవాహాన్ని అవలీలగా యీదిన స్త్రీ తన తల్లి.

తల్లి-గుర్తుకు వచ్చింది శకుంతలకు.

## 2

భోజనం కాంగానే మధ్యాన్నం పూట ఓ కునుకు తీయటంపార్వతికి అలవాటు. మామూలు ప్రకారం నిద్రపోతున్న పార్వతి ఉలిక్కిపడి లేచింది అకస్మాత్తుగా మెలుకువ రావటానికి కారణమేమిటా అని కళ్ళు మూసుకు ఆలోచిస్తుంటే, పక్కగదిలోంచి సవతితల్లి వర్ధనమ్మ కాశీయాత్ర చేసి వస్తూ వర్ధనమ్మని చూచి పోదామని ఇక్కడదిగిన ఆమె పినతల్లి శారదాంబ మాటలు పెద్దగా వినిపించాయి.

శారదాంబ మాట్లాడుతుంటే వేరే మైకు అక్కరలేదు, కంచుకంఠం.

తన కెందుకు మెలుకువవచ్చిందో పార్వతికి అర్థమయిపోయింది. గాఢ నిద్రలో వున్నప్పుడు నిద్ర మెలుకువ వస్తే తలనొప్పి వస్తుంది సన్న సన్నగా తలపోటు ప్రారంభం కావటంతో కణతలు నొక్కుకుంటూ వుండిపోయింది.

వినాలని వుద్దేశ్యం లేకపోయినా వాళ్ళ మాటలు పక్కగదిలోంచి వినపడుతున్నాయి. మాటల మధ్యలో తన పేరు విని జాగ్రత్తగా చెవి వొగ్గింది పార్వతి.

"ఇహ యింతేనా ? అతగాడు తీసు

కెళ్ళటం లేదన్నమాట!" శారదాంబ కుతూహలంగా అడిగింది

"అన్నమాటే!" వర్ధనమ్మ వ్యంగ్యం అంది.

"దైవం చిన్నచూపు చూడటడతో నీ రాత ఇలా అయింది. చిన్న చిన్న పిల్లలు. నీ పాట్లు నువ్వు పడుతుంటే, ముగ్గురు పిల్లలతో తనిక్కడ వుండటం ఏమిటి? అసలతను పార్వతిని ఎందుకు తీసుకెళ్ళడు?"

"ఇవాళొచ్చి రేపు వెళ్ళేదానికి తన కెందుకు నా సంగతి? పరులగురించి తెలుసుకోవాలనే తపన అన్నింటికన్నా పెద్ద జబ్బు!" వింటున్న పార్వతి అను కుంది కసిగ.

వర్ధనమ్మ తగ్గు స్వరంతో చెప్తున్నా పార్వతికి వినపడుతూనేవుంది.

"పార్వతి ఒక్కగా నొక్క కూతురుగదా ఆవిడ గారాబానికి అంతులే కుండా పెంచింది. ఒక్కడే అబ్బాయి ఆస్తివుంది అని పెద్ద కట్నంతో మధుసూధనంకి యిచ్చి పెళ్ళిచేశారు. ఇంతా అప్పుడు పార్వతి వయసు తొమ్మిదేళ్ళు. మరో నాలుగేళ్ళకి పెద్దమనిషి కావటం అచ్చట ముచ్చట చూడకుండానే ఆవిడ మరణించటం తరువాత ఆయన నన్ను పెళ్ళాడటం వెంట వెంటనే జరిగి పొయ్యాయి. ఇదంతా తెలిసిందేకదా నీకు విన్నీ!" అంది వర్ధనమ్మ.

"ఆ...ఆ...తెలియకేమి, ఆ తరువాత నీకు శంకకం పుట్టినప్పుడు, మూడోకాన్పు శ్రీనాధుడి పుటకలకి వచ్చానుగా! పార్వతి అత్తగారు చని పోవటం, పసిపిల్ల తల్లిని మధుసూధనం పార్వతిని తనింటికి తీసుకెళ్ళలేదని చెప్పావు." గుర్తుచేసుకుంటు అంది శారదాంబ

"పసిపిల్ల తల్లనీ కాదు, అత్తగారు చచ్చిందనీకాదు ఆయన వింటే ఏమన్నా అనుకుంటారని నిజం చెప్పలేదు. మధుసూధనం తండ్రి పసితనంలోనే చనిపోవటంతో ఆవిడ, ఆడింది ఆటగా పాడింది పాటగా అతగాడిని పెంచింది. సగం చదువుతోనే ఆపేసి నాటకాల వాళ్ళతో చేరి నాటకాలాడుతూ ఊరూరు తిరగటం ఎప్పుడో యింటికి రావటం. అటు తల్లికి పట్టలేదు ఇటు యీయనకి పట్టలేదు. పార్వతి అత్తగారింటికి వెళ్ళిందీ లేదు. పార్వతిని అత్తగారింటికి పంపించరా, అని ఓసారి ఆయనతో అంటే, "ఏం! నీకేమన్నా కష్టంగా వుందా! పార్వతి ఇక్కడ వుంటే? అది రాజాలా ఇక్కడే వుంటుంది. అతనే వచ్చి పోతుంటాడు" అన్నారు. అలా వచ్చి పోతుం డేనే ఇద్దరి పిల్లల తల్లి అయింది. మాయదారి జ్వరం వచ్చి ఆయన కన్ను మూశారు. మొగదక్షతలేని కొంపని మధుసూధనం మమ్మల్ని ఆదుకున్నదీ లేదు. పార్వతిని కాపురానికి తీసుకెళ్ళిందీ లేదు."

"అత్తింటి గుమ్మం తొక్కకుండా ముగ్గురు పిల్లలతల్లి అయింది. పిల్లలు కూడ పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. తనింటికి తీసుకెళ్ళేది లేదా ?" శారదాంబ అడిగింది.

"తనూ" తనకో ఇల్లు. నాటకాలాడుతూ వూళ్ళు తిరగటంతో ఆస్తి హారతి కర్పూరంలా హరించుకుపోయింది. పెళ్ళాన్ని తీసుకెళ్ళి ఎక్కడ పెట్టుకుంటాడు ? మధ్య మధ్య వస్తుంటాడు. రెండురోజులుండి వెళుతుంటాడు పార్వతి ఒక్కతికూడా కాదాయె. ముగ్గురు పిల్లలు. నా పిల్లలు ముగ్గురు. ఇంతా నా ఖర్మ. దానికేం దానికి బాగానే జరుగుతున్నది." ముక్కు జిర్రున చీదింది వర్ధనమ్మ.

వుంటున్న పార్వతి కోపంగా లేవబోయి నిస్సత్తువగా మళ్ళీ పడుకుంది.

"పూర్తిగా మొగాడిని అనవలసిన పనిలేదు. ఆడదానిలో వుంది. మీతో తీసుకెళ్ళండని పట్టుపట్టి కూర్చోకూడదూ పార్వతి. జరిగిందే చాలని అనుకుంటే ఎట్లా ?"

"చీకూ చింతా ఏంలేదు. చిన్నప్పటినుంచీ అలాగే జరిగింది. అదృష్ట జాతకురాలు. మొగుడొచ్చిన రెండు రోజులు పట్టపగ్గాలుండవ్." అంది వర్ధనమ్మ.

"ఈతఫా వచ్చినప్పుడు పార్వతిని తీసుకెళ్ళమని గట్టిగా చెప్పెయ్యి. నలుగురు మనుషులను ఎంతకాలం భరిస్తావు? నీ పిల్లలకు చివరికి చిప్ప యిచ్చేటట్లున్నావు చూడబోతే," సన్నగా చివాట్లు పెడుతున్నది శారదాంబ.

అంతవరకూ విన్న పార్వతి దిండులో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది. తన అసమర్థతకు చింతిస్తూ

వేడి వేడి కన్నీరు చీర చెంగును పూర్తిగా తడిపిన తరువాత మనసు తేలికపడింది. జోరీగల్లా ఆలోచనలు ముసురుతుంటే మరింత గట్టిగా కణతలు నొక్కుకుంటు పడుకుంది పార్వతి.

"మొదట్లో తండ్రి" పోనీలేమ్మా పార్వతీ ! అత్తగారింటికి వెళ్ళనంత మాత్రాన నీకొచ్చిన నష్టమేమిటి ? మధు నాటక సమాజం స్థాపించి ఊళ్ళు తిరుగుతున్నాడు. పట్టుమని నెలకు నాలుగు రోజులు ఇంటిపట్టున వుండడు. నీవెళితే వంటరిగా వుండాల్సిందేకదా ? ఇక్కడయితే నలుగురం వుంటాము." అంటూ సమర్థించేవాడు. అప్పట్లో అదీ నిజమనిపించింది. తరువాత అది అలవాటుకింద మారింది

పేపర్లో భర్త ఫోటో పడినప్పుడు "ఊరు ఊరు వచ్చి" గొప్ప కళాకారుడి భార్యవు. అదృష్టవంతురాలివని పొగిడినవాళ్లు పొగిడినట్లేవున్నారు. సందేశాత్మక విప్లవాత్మక నాటకాలు సొంతంగా రచించి ప్రదర్శించటంలో

మంచి పేరు వచ్చింది అకస్మాత్తుగా తండ్రి మరణం, పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళవటం, పిన్ని సాధింపులు. తనకి జ్ఞానోదయం అయింది.

"ఒక గది చూడండి, మీరొచ్చి నప్పుడే వద్దురుగాని, నే యీ ఇంట్లో వుండలేను" అని పేచీ పెట్టుకుంది. ప్రాధేయపడింది. 'ఊహూ' తనకన్నీరు వారిని కరింగించలేదు

"వేరేవుంచి నిన్ను పిల్లలను పోషించే శక్తిలేదు. మొదటినుంచీ ఇక్కడే వున్నావు. మంచోచెడో ఇక్కడేవుండు" అన్నారు.

తను అశక్తురాలు. పిన్ని అన్నట్లు వారిని చూడంగానే కరిగిపోతున్నది భర్తను కొంగుకి ముడేసుకునే తెలివి తేటలు ఎంతమాత్రం లేవు. ఏదయినా అడిగితే సమాధానం వుండదు. మాయ మాటలు చెప్పి, జాలిగా ముఖంపెట్టి తన అవసరం తీర్చుకుని పోవటమే.యీ దఫా వచ్చినప్పుడు వూరుకోకూడదు, తాడో పేడో తేల్చాల్సిందే.

"అమ్మా! అందరి నాన్నగార్లలా మన నాన్నగారు ఇంట్లో వుండరేమని ప్రశ్నించే పిల్లలు, తండ్రి సంపాదన తల్లి సొమ్ముదాచి అస్తమానం సాధించే పిన్ని వింత జంతువుని చూచినట్లు తనను చూచే ఇరుగుపొరుగు. ఇహ తను భరించలేదు. తన పిల్లల భవిష్యత్తు వూహించి ముందు జాగ్రత్త పడుతున్నది పిన్ని. ఎదిగే తన పిల్లల భవిష్యత్తు మాటేమిటి? తను జాగ్రత్తపడటంలేదు. కళ్లు మూసుకు ప్రవర్తిస్తున్నది ఇప్పటి కయినా, తన కళ్లు తెరిపిళ్ళుపడ్డాయి. ఊహూ... ఇంక యీ కళ్ళు మూతలు వేయను.

ఓ నిశ్చయానికొచ్చిన పార్వతి తృప్తి పడి లేచి కూర్చుంది మంచంమీదనుంచి.

పక్కగదిలోంచి ఇంకా మాటలు వినపడుతూనే వున్నాయి తనుగురించి. అయినా వినదల్చుకోలేదు పార్వతి.

### 3

"అమ్మా! నాన్నగారు వూరునుంచి వచ్చి చాలారోజులయింది కదూ?" పెద్ద వాడు రఘూ గొప్పవిషయం ఆరాతీసిన మొనగాడిలా ముఖంపెట్టి అడిగాడు.

చిరిగిన చీరకుడుతున్న పార్వతి ఉలిక్కిపడి తలఎత్తి రఘూ ముఖంలోకి చూచింది.

"మీ నాన్నగారు వచ్చారా? అని సుబ్బరామయ్య మాష్టారు అడిగా రమ్మా!" అన్నాడు రఘూ. తల్లి 'ఊ' కూడా కొట్టకపోవటంతో తిరిగి ... "రాలేదు. ఎందుకురాలేదో తెలియదు. మా అమ్మ కూడా రోజూనాన్నగారికోసం చూస్తూ వుందని, చెప్పాను" అన్నాడు రఘు.

"ఊ? నన్ను విసిగించక అవతలి కెళ్ళు." కసురుకుంది పార్వతి. బిక్క ముఖం వేసుకొని బైటికి వెళ్ళాడు రఘు.

"అనవసరింగా కోప్పడ్డాను. యీ మధ్య అకారణంగా కోపం వస్తున్నది. పిల్లలమీద చిరాకుపడి ప్రయోజనం ఏముంది?" అనుకుంది పార్వతి.

"అయిపొచ్చింది, అయిదుపైస లివ్వమ్మా!" జారిపోతున్న లాగును పైకి లాక్కుంటు కిష్టడొచ్చాడు.

ఆటలన్నా చిరుతిండన్నా కిష్టడికి ప్రాణం. అక్క, అన్న, తల్లిని ఏడ్పించకపోయినా ఆవార కిష్టుకు దేనికో దానికి పేచీపెట్టి పార్వతికి కళ్ళనీళ్ళు తెప్పిస్తుంటాడు. చెప్పినా అర్థంచేసుకునే యీడుకాదు

పార్వతి లేచివెళ్ళి పెట్టంతా వెతికితే పదిపైసలబిళ్ళ కనబడింది. పెడుతూ "రేపటికి అయిదుపైస లుంచుకో." అంది.

"ఉంటే వుంచుకుంటా" బైటకు పరుగతీస్తు అన్నాడు కిష్టడు.

"బాలకృష్ణుడి అల్లరిని మించిపోయింది నీ అల్లరి కిష్టు" అనుకుని నవ్వుకుంది పార్వతి

'వారు వచ్చినప్పుడల్లా ఎంతోకొంత తెచ్చిచ్చి వెళ్ళేవారు. రావటం ఆలస్యం అయితే మనియార్డర్‌చేసి ఉత్తరం రాసేవారు. కాని...యీతప్పా రెండూ లేవు. వారిచ్చినదానిలో పది పదిహేను తనుంచుకుని మిగిలినది పిన్నిచేతిలో పెట్టబట్టి, పిల్లలు పైసలడిగినా, పిన్ని గట్టిగా మాట్లాడక రోజులు గడిచిపొయ్యాయి. వారిస్తున్న కొద్ది మొత్తానికి తనకీ పిల్లలకీ ఓ పూట తిన్నా అర్ధాకలితో లేచి పోవాల్సిందే నాన్న వున్నంతవరకూ పిన్నినోట్లో నాలుక లేదు. నాన్న పోయింతరువాత మొదట్లో నోరు మెదపక రానురాను బాటుగా ఇప్పుడిప్పుడు పబ్లిక్‌గా ఏదో ఒకటి అనేస్తున్నది.

తను ఇంట్లో ఉండటం పిన్నికి శిక్ష. పిన్ని ఇంట్లో తనుండటం ఖర్మ. పరధ్యానంగా కుట్టటంవల్ల కసుక్కున వేలిలో సూది దిగబడింది. 'అబ్బా' అనుకుంది చైతన్యం వచ్చి పార్వతి.

"ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే యీ పూట సరోజ యింటికి వెళ్ళినట్లే!" సూది దిగిన వేలిని మరో వేలితో నొక్కిపట్టింది రక్తం పైకిరాకుండా. ఓ నిముషం ఆగి చీర కుట్టటం పూర్తిచేసి పెరట్లోకెళ్ళి ముఖం కడుక్కువచ్చింది బొట్టు పెట్టుకుని జడ వేసుకుంది.

పిల్లలతోను పిన్నితోను చెప్పి సరోజ యింటికి వెళ్ళాలంటే యిరవై నిమిషాలు పడుతుంది.

ఇరవై నిమిషాలు నడవటం కష్టం కాదు. తను వెళ్ళేటప్పటికి సరోజ ఇంట్లో లేకపోతే కష్టం. పదిళ్ళపాపమ్మ సరోజ.

సరోజ తనెళ్ళే సమయానికి ఇంట్లో వుంటుందా? వుండదా? దోవ పొడుగునా ఆందోళనపడుతూనే వుంది పార్వతి.

పార్వతికి గుమ్మంలోనే ఎదురయింది సరోజ.

"హాయ్! పారూ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకి, దోవ తప్పి వచ్చావ్?" పార్వతి భుజంమీద చెయ్యివేసి వూపుతూ అంది సరోజ

"దారి చూచుకుంటూ తిన్నగా ఇక్కడికే వచ్చా!" పేలవంగా నవ్వి అంది పార్వతి

"డైలాగ్ బాగుంది...మీ యింటికి ఎప్పటికప్పుడు వద్దామని అనుకుంటూ వుండటం, ఏదో ఒక అడ్డంకితో ఆగి పోవటం."

"నీ సంజాయిషీ నాకేం అక్కర లేదు. రావాలనుకుంటే రావచ్చు."

"అలా అనకేవ్ పారూ! నింద నా మీద వెయ్యకపోతే నీవేం రాచకార్యాలెలగబెడుతున్నట్లు? నా సంగతి చూడు...నిన్న శ్యామల వాళ్ళింటికి పేరంటానికి వెళ్ళాను. మొన్న జమునా బాయిగారింటికి వెళ్ళాను, మహిళా మండలి విషయం మాట్లాడటానికి. అటు మొన్న రాధకు నొప్పులొస్తుంటే ఆస్పత్రిలో చేర్చి అక్కడే వున్నాను. క్రితం రోజు..."

"సినిమాకెళ్ళి వుంటావు" మాట పూర్తిచేసింది పార్వతి.

పార్వతి నవ్వులో శృతి కలిపింది సరోజ.

సరోజ అదీ ఇదీ అని లేకుండా కబుర్లు చెప్పేస్తున్నది. పైకి 'ఊ' కొడుతున్నది పార్వతి.

"సరోజను మించిన స్నేహితులు ఎవరూ లేరు తనకు. ఆప్తమిత్రురాలయినా డబ్బు ఎప్పుడూ అడగలేదు. నోరు విప్పి తన సమస్యలు చెప్పుకో లేదు. ఇప్పుడు అడగక తప్పదు. వాడు రావటం ఎన్నాళ్ళు పడుతుందో? పిల్లల పుస్తకాలు కొనటానికి డబ్బులు కావాలి. పుస్తకాలు లేకుండా బడికి రావద్దని మాష్టారు కోప్పడ్డారని రఘు చెబితే కళ్ళ నీళ్ళు పెట్టుకోటం తప్ప ఏం చేయలేక పోయింది. ఎక్కడ డబ్బడుగుతావో అని విన్ని ముందే జాగ్రత్తపడి చెప్పింది."

"పారూ! నీ శరీరం యిక్కడాను మనసు ఎక్కడో వున్నట్లుంది!" పార్వతి తను చెప్పేది వినటంలేదని గ్రహించి గట్టిగా అంది సరోజ

"కాస్త డబ్బు కావలసి వచ్చింది సరో," అంది నేల చూపులు చూస్తు పార్వతి.

"ఎంత కావాలి? ఎందుకు?"

డబ్బు ఎంతకావాల్సిందీ, ఎందుకవసరమయినదీ, చెప్పింది పార్వతి, తల ఎత్తకుండానే.

"ముష్టి పాతిక రూపాయలు అడగటానికి ఇంత మొహమాటమా? ఇప్పటి

దాకా ఎందుకాగావ్ ?" సరోజ చివాట్లు సన్న సన్నగా పెట్టి పార్వతి కష్టసుఖాలు అడిగింది.

ఉబికివస్తున్న దుఃఖాన్ని వ్యర్థ ప్రయత్నంతో అపుకుంటూ అన్నీ చెప్పింది పార్వతి.

అంతా విన్న తరువాత "నువ్వు బాధపడనంటే ఓ విషయం అడుగుతా పారూ ?" అంది సరోజ.

"బాధ...? దానికి పూర్తిగా అలవాటు పడ్డాను. నీవు బాధపడక అడుగు."

సరోజ కనుబొమలు ముడిచి పెదవి కొరుక్కుంటూ పార్వతివైపు చూస్తూ కూర్చుంది.

సరోజ చేతిని వడిలోకి తీసుకుని మెల్లగా నిమురుతూ "ఏమిటో, ప్రపంచమంతా తలక్రిందులయినట్లు ముఖం పెట్టావు !" అంది పార్వతి.

"మీవారు కథానాయకి వేషాలు వేసే రమామణిని పెళ్ళిచేసుకున్నారని వార్త. దానికి ఓ పిల్లాడు -కూడానుట, నీకు తెలుసా పారూ ?"

నువ్వు చెప్పింది నిజమేనా సరూ ?" పార్వతి కంగారుగా అంది.

"నిజమైన వార్త. ఇందుట్లో అబద్ధం లేదు."

"వారు అలాంటివారంటే నమ్మ లేకుండా వున్నా సరూ ?"

సరోజ తన కెలా వివరం తెలిసిందీ పూసగుచ్చినట్లు చెప్పింది పార్వతితో. అంతెగాక మధుసూదనం వూరినుంచి వచ్చిన తరువాత అతగవలసింది చేయవలసింది బోధించి ధైర్యం చెప్పింది.

రక్తం లావాలా ఉడుకులెత్తుతుంటే, మనసులో 'అగ్నిపర్వతం పేలటానికి సిద్ధంగావున్నా, అన్నింటికీ తెగించిన దానిలా స్థిరంగా కూర్చుని వింది పార్వతి.

సరోజ యిచ్చిన పాతిక రూపాయలు బెంగున కట్టుకుని, కొత్తగా తెలిసినవార్త మననం చేసుకుంటూ ఇంటికి బైలుదేరింది పార్వతి.

## 4

కాఫీ తీసుకుని గదిలోకి వెళ్ళబోతుంటే పార్వతికి అడ్డు తగిలింది వర్ధనమ్మ.

"నే అన్నానని కోపం తెచ్చుకోకు. లోకులనుకునేది చెప్పాను. అతగాడితో గట్టిగా చెప్పు. ఆడమనిషిని ఇంత సంసారం యీదలేను. యీ బ్రతుకు బ్రతికేకన్నా నుయ్యో గొయ్యో చూచుకుంటాను. కళ్ళు మూసుకుంటే హరీ అనటానికి నిముషం పట్టదు."

"మెత్తగా చెప్పి నీవు తిట్టుకుంటున్నా ఆ మాటలన్నీ అన్వయించేది నాకే పిన్నీ ! గ్రహించలేనంత మూఢురాలిని కాను." మనసులో అనుకుని పైకి "ఊ" కొట్టి కాఫీకప్పుతో గదిలో అడుగుపెట్టింది పార్వతి.

మధుసూదనం శేషతల్పంమీద విష్ణుమూర్తిలా తల కింద చేయి పెట్టుకుని



మంచానికి నిండుగా పడుకొని పార్వతి రాకకోసం ఎదురు చూస్తున్నాడు. గుమ్మంలో పార్వతిని చూచి చిరునవ్వు నవ్వాడు.

మధుసూదనం నాటకంలో నటుడే కాదు. మామూలుగాను నటుడే. నవ్వినా, మాట్లాడినా, నడిచినా, కూర్చున్నా, ప్రత్యేకతతో చూపరులను ఆకట్టుకునే విధంగా వుంటాడు.

"ఈ నవ్వే, నేను లొంగిపోవటానికి కారణం. కాదు నా మెతకతనమే." అనుకుంది పార్వతి. మౌనంగా కాఫీ అందిచ్చింది.

"పారూ!"

"ఊ...,"

"దేవిగారికి నాపై కోపం వచ్చినట్లుంది ? అరె...మాట్లాడవోయ్, నోటి ముత్యాలేం రాలిపోవు ఎప్పుడింటికొచ్చినా క్షణం కనుమరుగు అయ్యేదానివికాదు... వచ్చినప్పటినుంచీ చూస్తున్నా నానుంచి తప్పించుకుని తిరుగుతున్నావ్, ఇదంతా కోపమేనా ? ఊ... ?" పార్వతిని దగ్గరకు లాక్కుని లాలనగా అడిగాడు మధుసూదనం.

"పిల్లలు చూస్తారు. చెయ్యి తియ్యండి." కంగారుగా గుమ్మం వైపు చూస్తూ అంది పార్వతి

"భుజంమీద చెయ్యి వెయ్యకూడదా ?"

పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నారు సామాన్య విషయం కూడా వాళ్ళను అమితంగా ఆకర్షిస్తుంది. పిల్లలు ఎదుగుతున్నారు వారి బరువు బాధ్యతలు అవక్కరలేదు మీకు."

"అన్నీ చూచుకోటానికి నువ్వున్నావ్ కదోయ్ పారూ !" మధుసూదనం తేలిగ్గా అన్నాడు.

తొందరపడకూడదు. నిదానంగా అన్నీ అడిగి తేల్చుకుందాం అనుకున్న పార్వతికి నిగ్రహించుకోలేని కోపం వచ్చింది. భుజంమీద వున్న భర్త చేతిని విదిలించుకొని లేచింది.

"అవును నే వున్నాను. ఇంకా చావు రాలేదంతే, మీరు వచ్చి వుండేది రెండు రోజులు. ఆ రెండు రోజుల్లో ఊళ్ళో తిరిగి రావటం. ఇంట్లోవున్న కాసేపు మాయమాటలు చెప్పి నా కళ్ళు కప్పటం. పిల్లలెలా వున్నారు ? ఏం చదువుతున్నారు ? వారి భవిష్యత్తు ఏమిటి ? ఒక్కసారి అడిగారా ? నీవున్నావుగా ! ఎంత తేలిగ్గా అన్నారండీ, 'అమ్మా ! అందరి నాన్నగార్లల్లా మా నాన్నగారు మన దగ్గర వుండరేమమ్మా ?' అంటూ పిల్లలు వేధిస్తుంటే, మీరిచ్చే డబ్బు చాలక యీ ఇంట్లో వున్నందుకు పిన్ని హీనంగా మాటలంటుంటే, ఇరుగు పొరుగు హేళనగా చూస్తుంటే, నాకు చావు రాలేదు మామూలుగానే వున్నాను" ఆవేశంలో ఆపై నోరు పెగల్లేదు పార్వతికి. చీర చెంగు నోట్లో కుక్కుకుంది. ఎక్కిళ్ళు పైకి రాకుండా వ్యర్థ ప్రయత్నం చేస్తూ.

"పారూ నేను నాటక సమాజానికి అంకితం అయిపోయాను. నాలాంటి ప్రసిద్ధ కళాకారుడు సంసారం, భార్య, పిల్లలు అనుకుంటూ చేతులు ముడుచుకు కూర్చుంటే, ఎప్పటికీ కీర్తి శిఖరాలను అందుకోలేడు."

"కళాకారులు సన్యాసులు కారండీ ! వారూ భార్యా పిల్లలతో సుఖంగా వుంటారు. మీకు ఏ జంజాటన లేకుండా తిరగటం అలవాటయింది. కీర్తి కాంక్ష తోడయింది. మీకు నేను ఏ విషయంలోనూ అడ్డుతగలను. యీ క్షణంనుంచీ నేనూ పిల్లలం మీ వెంట వుంటాము"

మధుసూదనంకి చిర్రెత్తుకొచ్చింది.

"నాతో వుండటం అన్నది ఎప్పటికీ కుదరదు ఎక్కడో పడుకుంటాం. ఏదో తింటాం. ఇవాళ యిక్కడ, రేపు అక్కడ ఎలా కుదురుతుంది! నీకు అలవాటయిన యిల్లు. మనుషులు" కచ్చితంగా చెప్పేశాడు మధుసూదనం

''పిల్లలను పెంచి పెద్దచేయవలసింది, యిరువురి బాధ్యత.నే ఒక్కదాన్ని యీ భారం మోయలేను"

"ఆ సంగతి ముందే ఆలోచించాల్సింది పిల్లలు పుట్టిం తరువాత చింతించటం చేతులుకాలి ఆకులు పట్టుకున్న చందనం లాటిది''

"అంటే...! పిల్లలు కనటంలో నా ఒక్కదాని చెయ్యే వుందా!" తమ యిరువురిమధ్య యిలాటి సంభాషణ దొర్లుతున్నందుకు సిగ్గుతో చితికిపోతూ అంది పార్వతి

"ఆ... పుట్టినబిడ్డకు తల్లి ఎవరో తెలుస్తుందిట తండ్రి తెలియదు "బాబూ! ఇతను నీ తండ్రి'' అని తల్లి చెపితే తప్ప. ఓ మహాకవి కథనం ఇది"

"ఛీ... ఛీ.. ఏమంటున్నారో తెలిసే అంటున్నారా? ఇంతవరకు లోకులు అంటున్నది కారుకూతలని వూరుకున్నాను. రమామణిని వివాహంచేసుకున్నారటగా? భార్యవుండగా మరో పెళ్ళి చేసుకున్న మీరు ఇంతకన్నా ఏం మాట్లాడగలరు!" పార్వతి తను కళ్లారా చూస్తే తప్ప రమామణి విషయం ఎత్త కూడ దనుకుంది. అనుకోకుండా ఆ ప్రసక్తి రానే వచ్చింది. ఎలాగూ బైట పడింది కాబట్టి నిజం గట్టిగా తెలుసుకోటానికే నిశ్చయించుకుంది

పార్వతి మాటలువిని నిర్ఘాంత పోయాడు మధుసూదనం.

''ఎవరు చెప్పారు నీకిది?"

"చెప్పింది ఎవరైనా నిజమేచెప్పారు. నిజం కాదంటారూ, నన్ను పిల్లలను మీ వెంట తీసుకెళ్ళండి. కలో గంజో తాగి మీదగ్గరే పడి వుంటాము."

"ఎవరో గన్నాయిగాడు చెప్పింది నిజం. అక్కడికి నా మాట అబద్ధం. నువ్వు నమ్మినా నమ్మకపోయినా, నిన్ను నా వెంట తీసుకెళ్ళేది లేదు ఇలా ఇంటికి రాగానే పోట్లాట పెట్టుకుంటే నా ముఖం కూడా చూడవు గుర్తుంచుకో" మధుసూదనం బెదిరింపుగా అన్నాడు.

"మీరు కాదంటే నమ్మేటంత మూఢురాలినికాదు. రమామణిని పెళ్ళిచేసుకున్నారు. అందుకే నన్ను తీసుకెళ్ళనంటున్నారు. నాటకాల మనిషి నాటకం ఆడక యింకేం చేస్తాడు మీరు తీసుకెళ్ళకపోయినా మీవెంట ఎంతదూరం వెళితే అంతదూరం వస్తాను."

పార్వతి మొండితనం తెలిసిన మధుసూదనం తగ్గిపోయాడు. "నే చెప్పేది విని నన్నర్థంచేసుకో పారూ!" అంటూ పార్వతి చెయ్యి పట్టుకు తీసుకువెళ్ళి మంచంమీద కూర్చోపెట్టాడు

"అనుకోని సంఘటనలు కొన్ని జరిగి రమామణిని దగ్గరకు తీసాను. ఎలా వదిలించుకోవాలో తెలియటం లేదు. నావల్ల పొరపాటు జరిగింది నిన్నూ పిల్లలను అన్యాయం చేయను. వచ్చి పోతుంటాను, డబ్బు పంపిస్తాను నువ్వు రావటంవల్ల పరిస్థితులు విష మిస్తాయి. నాటక సమాజంనుంచి బైటికి రావలసివస్తుంది నాకు ఏ పనీ చేతకాదు జోలి తగిలించుకొని వీధులు తిరగా ల్సిందే.''

తను విన్నది నిజమయ్యేటప్పటికి, ఎన్నో అనుమానాలు బైలుదేరాయి. పార్వతికి. గోడమీద పిల్లివాటంగాఅంది. "అయితే, నే విన్నవన్నీ నిజాలే చాలా మంది ఆడవాళ్ళతో మీకు సంబంధం వుందిటగా?"

''ఎవరు చేరవేస్తున్నారు నీకీ వార్త లన్నీ?"

"కళ్ళారా చూచినవాళ్ళు." మరో అబద్ధం ఆడింది పార్వతి.

మధుసూదనం మంచంమీదనుంచి విసురుగా లేచాడు

"నా గురించి ప్రతినిమిషం ఎంక్వ యిరీ చేయటంలో నీ వుద్దేశ్యం ఏమిటి? నా ఇష్టమొచ్చినట్లు వూరేగుతాను. కావా లంటే నువ్వూ వూరేగు ఎప్పటిలాగా వచ్చి పోతూ వుండనా? పూర్తిగా వెళ్ళి పొమ్మంటావా? నా అవసరం డబ్బవ సరం లేకుండా బ్రతకగలవా?"

"భర్త క్షేమం గురించి తెలుసు కోటం భార్య ధర్మం. ప్రతినిమిషం మీ సన్నిధిలోనే వుండే అర్థమైన తిరుగుళ్లా తిరగరు. అందుకే మీతో వస్తానని మరో సారి చెపుతున్నాను మీ అవసరం అంటే ఏమిటి? మీ వీలయినప్పుడు ఓసారి రావటం. ఫలితం మరో బిడ్డకు తల్లిని కావటం అదేగా నే పొందుతున్న స్వర్గం? ఇస్తున్న డబ్బంటారా? రెండు నెలలకు మూడు నెలలకు పాతిక, యాభయి. అర్జంట్ అని లెటర్‌రాస్తే పంపేది మరో పాతిక నాలుగు పొట్టలకు నిండా గంజి కూడా రాదు. విన్ని దయాధర్మ బిచ్చం మీద బ్రతుకుతున్నాను. "ఇహపై మిమ్మల్ని భరించలేనని స్పష్టంగా చెప్పింది చివరిసారిగా నేను కావాలో, పరాయి ఆడవాళ్ళు, తిరుగుళ్ళు కావాలో చెప్పివేయండి"

''ఎందుకు ఇన్నిసార్లు అడుగుతావు? నిన్ను నా వెంట తీసుకెళ్ళటం కలలో మాట. నా అవసరం వుందో లేదో నువ్వే చెప్పు."

"శీలం అనేది స్త్రీకే కాదు పురుషుడికి కూడా ముఖ్యం. అర్థమైనవాళ్ళతో పోయివచ్చే మీతో కాపురం చేయటం నావల్లకాదు." పార్వతి కోపంతో వళ్ళు మరిచిపోయి అన్నది

"బరితెగించి మాట్లాడుతున్నావ్ పారూ! అది నీకే నష్టం. నా వద్ద నుంచి కానీ రాదు. నా ముఖం నీకు



చూపించను ఎలా బ్రతుకుతావో బ్రతుకు."

మధుసూదనానికి పార్వతిని ఎడా పెడా వాయించాలనిపించింది. ఏ మూలో తన తప్పున్నట్టు తోచి వెనక్కు తగ్గాడు. బ్రతిమిలాడితే ఆడవాళ్ళు లొంగిపోతారు. జాలిగా ముఖంపెట్టి ప్రేమగా మాట్లాడుతూ దగ్గరకు లాక్కున్నాడు పార్వతిని.

పార్వతి విసురుగా మధుసూదనం చేతులు త్రోసి అవతలికి జరిగింది. కోపంతో పొగలుకక్కుతు... "నా విషయంలో ఇంతవరకూ మీరు చేసిన ఘనకార్యం చాలు. నా భార్య, నా పిల్లలు అనుకున్ననాడు నేనే మీ దగ్గరకు వస్తాను." తిరస్కారంగా అంది

"సరే, ఆడదానివి నీవే అంత అహం ప్రదర్శిస్తుంటే, నాకేం పట్టింది. 'క్షమిం

చండి. నాది పొరపాటయింది,' అని నీ వన్ననాడే తిరిగి నీ ముఖం చూసేది. గుర్తుంచుకో," అని విసురుగా పెద్ద పెద్ద అంగలేస్తూ బైటికి వెళ్ళిపోయాడు మధుసూదనం.

ముఖం దోసిట్లో కప్పుకుని నుంచున్న చోటే కింద కూలబడింది పార్వతి

## 5

"ఎప్పటికీ నీ మేలు మరచిపోను సరోజా!" సజల నయనాలతో అంది పార్వతి.

"నువ్వే త్తు పిచ్చిదానివే పారూ! కష్ట పడ్డావ్ ఉద్యోగం సంపాదించావు. నే చేసిందేముంది?" సరోజ నవ్వుతూ అంది.

"సిదేం లేదూ? ఎంత నిగర్విగా అంటున్నావే వారు ఇంటికి వస్తే" అత గాడితో గట్టిగా తేల్చేయి. నెలకి వంద పైన పంపుతాడో, నిన్ను తీసుకెళతాడో తేల్చుకొని నాతో చెప్పు, అన్న పిన్ని, వారు నన్ను కాదని వెళ్ళిపోయారని తెలిసి నానా మాటలంది,మొగాడిని రెచ్చ గొట్టి యింట్లోంచి తరిమేయటం ఓ తెలి వేనా? ఒకసారి ఇంటిమొహం చూచిన వాడిని పదేపదే వచ్చేటట్లు చేయాలిగాని! అయినా ఆ అవసరం నీకేందుకు. నీకు నీ పిల్లలకు దర్జాగా జరిగిపోతుందాయె?" అంటూ నిమిషానికొకసారి సాధింపు. ఆ తరవాత తిండికి మొహంవాచిన పిల్లల గోల అవసరానికి తల వొగ్గి బ్రతుకు తున్న నేను ఇలాటి బ్రతుకు పగవాడికి కూడా వద్దు సరూ!"

"ఇప్పుడవన్నీ ఎందుకు పారూ?"

"చెప్పనియ్యి సరూ! నా కాళ్ళమీద నేను బ్రతికే ప్రయత్నం చేస్తాను. అందాకా ముష్టిదాన్ననుకుని నన్నూ, పిల్లలను భరించు పిన్నీ! అని తల పగల కొట్టుకుని ఏడ్చాను సరేనంది పిన్ని. అందుకే ప్రతినిమిషం సాధిస్తున్నా, ఇలాటి శుభదినం వస్తుందనే సహనంతో రోజులు గడిపాను. ఎసెస్.యల్.సీ అయినా తప్పి వుండబట్టి అది కంప్లీట్ చేసి టీచర్ ట్రైనింగ్ అయి, టీచర్గా పోస్ట్ సంపాదించాను వీటికి డబ్బు ఎక్కడినుంచి వచ్చింది? నువ్వు ఇవ్వ బట్టే కదా? మీవారు కూడా సహృద యులు కాబట్టి గబగబ అన్ని ఏర్పాట్లు చేశారు కాస్త కుదుటపడ్డ తరువాత ప్రతినెలా కొంత మొత్తం పంపు తుంటాను ఇదంతా నీ దయకాదా?"

"డబ్బు విషయం ఎత్తావా పారూ! ముందు నీ సంగతి చూచుకో" సరోజ చిరుకోపంతో అంది

"వెళ్ళేది కొత్తవూరు. నా మంచి చెడ్డలు చూచుకొన్న తరువాత సంగతే నే చెప్పేదీను ఉద్యోగంచేస్తూ చదువు తాను పిల్లలను ప్రయోజకులను చేస్తాను. కాలానికి ఎదురీదటానికే ప్రయత్ని స్తాను." దృఢ నిశ్చయంతో అంది పార్వతి

"అన్నమాట సాధించగల నేర్పు, ఓర్పు నీలో వున్నాయి పారూ!"

"దానికి నీలాంటివారి సహకారం కూడా వుండాలి. అది పుష్కలంగా వుంది."

"ఎళ్ళుండేకదూ ఊరికి వెళ్ళే?"

"ఊ..."

"ఈ సంగతి మీవారికి తెలిస్తే ఏమంటారో?"

"నన్ను కాదని బ్రతకగలుగుతున్నదే అని పళ్ళు నూరుతారు. స్త్రీ అబలగా వుంటే హర్షిస్తారు గాని సబలగావుంటే భరించలేరు. యీ పురుష పుంగవులు." పార్వతి కసిగాఅంది.

సరోజ కాస్త ఆలోచించి అంది

"నా ఉద్దేశ్యంలో స్త్రీ ఎప్పుడూ అబల. సబల కానేరదు కాదు, శ్రీరామ చంద్రుడు, నిండు చూలాలయిన సీతమ్మను నిర్దయగా అడవిలో వదిలి రమ్మన్నాడు దుష్యంతుడు శకుంతలను ఎరగను పొమ్మన్నాడు. వారు పిల్లలను కన్నారు అవస్థల్లో జీవించారు యీ పుణ్య స్త్రీలను అబలలనాలా? సబలలనాలా? ఇప్పుడుమాత్రం ఓ స్త్రీ తన కాళ్ళమీద తాను బ్రతుకుతున్నా లోకులు కాకుల్లా పొడుస్తూనే వున్నారు. ఆమె అబలకాబట్టే కదా! నలుగురు నాలుగు మాటలనేది?" పార్వతి ఏమంటుందో అని ఆగింది సరోజ.

"నిజమే సరూ! నా సంగతే చూడు. పిన్ని ఇంటింటికీ నా సంసారం గురించి టాం టాం వేసినట్లుంది. బైటికి కాలు పెడితే తలోమాట విసురుతున్నారు. వారి సానుభూతిలో ఎంత వ్యంగ్యం దాగుందో తెలియని మూఢురాలిని కాదు. ఎదురు తిరిగి ఏదయినా అనాలని వుంటుంది. ఆవేశాన్ని అణచుకుంటాను. ఒక్కోసారి చావాలనివుంటుంది పిల్లలు గుర్తుకువస్తారు పిల్లలకు రెక్కలువచ్చిందాకా చావుమాట తలబెట్టకూడదనుకుంటాను" చీరచెంగుతో కళ్ళు అద్దుకుంది పార్వతి.

"పారూ! యీ సమస్య ఎప్పుడూ వుండేదే, భర్తచేత దెబ్బలుతింటూ పడివుంటే ఆమెకు లోకులు కావలసినంత సానుభూతి అందిస్తారు. తనమానాన తను బ్రతుకుతున్నా ఒంటరి స్త్రీని కాకుల్లా పొడుస్తారు. ఎక్కడికెళ్ళినా నీకు కొన్ని బాధలు తప్పకపోవచ్చు. వాటిని ధైర్యంగా ఎదుర్కొని నిలబడు"

"పిల్లలకోసం. తప్పదు సరూ! వాళ్ళ సుఖంకోసం ఎంతయినా కష్టపడతాను."

"పడకతప్పదు పారూ!" మనసులో అనుకుంది సరోజ

## 6

పార్వతి స్కూలుకి వెళ్ళింది. ఆ రోజు శలవు అయినా హెడ్‌మాష్టరు కబురు చేసినందున. వెళుతూ పిల్లల,

చేతిలో పావలా పెట్టింది ఏదయినా కొనుక్కోమని, కాసేపు ఆడుకున్నారు.

రఘు ఇంటికి కాపలావుంటే కిష్టుడూ శకుంతలా పావలా తీసుకుని బడ్డీ కొట్టుకి వెళ్ళి నాలుగు బిస్కెట్లు కొనుక్కు వచ్చారు.

"నువ్వూ, అక్కయ్యా, పెద్దవాళ్ళు చెరో బిసికెట్టు తీసుకోండి. నేను చిన్న వాడినిగా, రెండు బిసికెట్లు నాకు." అన్నాడు రెండోతరగతి చదువుతున్న కిష్టుడు

"ఉహూ ! పెద్దవాళ్ళకి పెద్ద పొట్ట వుంటుంది, నేను, అన్నయ్య మూడు బిసి కెట్లను సమానంగా తీసుకుంటాము. నువ్వు ఒకటే తిను చిన్నవాడివి కాబట్టి" అంది శకుంతల.

కిష్టుడు పేచీకోరయితే శకుంతల గడుగ్గాయి. రెండూ కానిది రఘు.

"అలాకాదు ముగ్గురం మూడు బిసి కెట్లు తిందాము ఒకటి అమ్మకు వుంచు దాము. అప్పుడు లెఖ్ఖ సరిపోతుంది." రఘూ మూడు బిస్కెట్లు యివతలపెట్టి ఒకటి కాగితంలో కడుతూ అన్నాడు.

శకుంతల సరేనంటూ వెంటనే వప్పు కుంది.

''అమ్మ తినదుగా, తరువాత నాకే పెడుతుందోచ్ఛ్" అన్నాడు కిష్టుడు.

"తిన్నావంటే చంపేస్తాను. మొన్నా అంతే అమ్మకు మజ్జిగ లేకుండా మొత్తం గుమ్మరించుకు తాగాడు. అమ్మకు సరిపో వనేగా నేను తగ్గించుకు పోసుకున్నాను. శకుంతల పెద్ద ఆరిందాలా చేతులు తిప్పుతూ అంది.

కిష్టుడు విన్నాడో లేదో బిసికెట్టు తిన టంలో పడిపొయ్యాడు.

"మీరు వింటానంటే నేనొకటి చెబు తాను." అన్నాడు రఘూ ఇటికల గుట్ట మీద కూర్చుని. వాడిదంతా పెద్దరికం తరహా

"చెప్పు, చెప్పు" అన్నారు యిద్దరూ ఒకేసారి ఉత్సాహంగా.

"మనకు డబ్బులేదు. నాన్నగారు రారు. పంపరు. అందుకేగా అమ్మ ఉద్యోగం చేస్తున్నది. మనకు అన్నం వండిపెట్టి స్కూలుకివెళ్ళి మళ్ళీ రాత్రికి చదువుకుంటూ చాలాసేపు వుంటుంది. మనకోసం అమ్మ యింత కష్టపడు తున్నది. అందుకని మనం అమ్మని ఏడ్పించకూడదు. అదికావాలి. ఇది కావాలి అని పేచీ పెట్టకూడదు మనం చూడకుండా అమ్మఎన్నోసార్లు ఏడ్చింది. అమ్మను ఏడ్పించినవాళ్ళు చెడ్డవాళ్ళు." ఓ నిమిషం ఆగి మళ్ళీ మొదలు పెట్టాడు

"నాన్నగారు మంచివారు కాదు, అందుకే అమ్మ ఏడ్చేది. అమ్మ ఉద్యోగం చేయకపోతే మనకు డబ్బు వుండదు డబ్బు లేకపోతే అన్నం వుండదు. ఇల్లు వుండదు బట్టలు కూడా వుండవు."

"రాత్రిళ్ళు అన్నం పెట్టమని అడుక్కుంటూ బూచబ్బాయిలు వస్తారు. అలాగా ?" అన్నాడు కిష్టుడు.

రఘుకళ్ళు మిలమిలలాడాయి. "ఆ.. అలాగే బూచబ్బాయిలమయిపోతాము." అన్నాడు వెంటనే.

కిష్టుడు కళ్ళముందు చలికి వణుకుతు జోలెచినిగిన లాగూతో రోజూ అడుక్కోటానికి వచ్చే పదేళ్ళబ్బాయి కనిపించాడు భయంవేసింది.

కిష్టుడికి మంచి బట్టలు కావాలి. అన్నంలో పప్పు నెయ్యి పెరుగు వుండాలి. చిరుతిండి కావాలి. ఎప్పుడూ తిండికి పేచీయే. ఓరోజు బూచి అబ్బాయిని చూపి రఘు చెప్పాడు "ఎవరైనా అన్నం పెడితేతప్ప వాళ్ళకు అన్నం వుండదు, చాలాసార్లు అన్నం దొరక్క మంచినీళ్ళు తాగి పడుకుంటారు" అని. క్రిష్టుడికి అన్నీ గుర్తుకువచ్చాయి.

"అన్నయ్యా ! ఇహనుంచి నేను అమ్మను ఏడ్పించను. నువ్వుకూడా అమ్మను ఏడ్పించకూడదు." అన్నాడు కిష్టుడు శకుంతల వైపు తిరిగి.

"అమ్మని నేనేం ఏడ్పించను. నువ్వే అన్నింటికీ పేచీ." అంది మూతితిప్పి శకుంతల.

"పండక్కి సిల్కు పరికిణీ కావాలని ఏడ్వలేదేమిటి ?" కిష్టుడు అన్నాడు.

"అమ్మను ఏడ్పించలేదు. నేనే ఏడ్చాను."

కిష్టుడికి ఏమి మాట్లాడాలో తెలియక మౌనం వహించాడు.

"మనం ముగ్గురం పోట్లాడుకో కూడదు. మంచి పిల్లలు పోట్లాడుకోరు. కొట్టుకోరు, అని అమ్మ చెప్పింది గుర్తుందా ?"

గుర్తుందంటూ శకుంతల కిష్టుడు తల లూపారు.

అప్పుడే యింట్లో కాలు పెట్టిన పార్వతి ఆశ్చర్యపోయింది, నిశ్శబ్దంగా కూర్చున్న పిల్లలను చూచి

తల్లిని చూస్తూనే కిష్టుడు బిసికెట్టు పొట్లం తీసుకుని రివ్వున పరుగెత్తు కుంటూ వచ్చాడు. "బిసికెట్టు నీకోసం వుంచాము తినమ్మా !" అన్నాడు పొట్లంవిప్పి బిసికెట్టు తీస్తూ.

"నాకెందుకు కిష్టూ ! బిసికెట్టు నువ్వే తిను" అంది పార్వతి.

"ఉహూఁ ! నీకోసం వుంచాము. నువ్వు తినాల్సిందే."

బిసికెట్లు సమానంగా పంచుకొన్న విషయం రఘు చెప్పాడు. పిల్లల తృప్తి కోసం సగం ముక్కతిని మిగతాది ముగ్గురికీ పంచియిచ్చింది. పార్వతి.

ఆ రోజు కిష్టుడు దేనికీ పేచీ పెట్ట లేదు.

ఇంటిపనంతా అయిన తరువాత పిన్నికి ఉత్తరం రాసింది ఘాటుగా. తరువాత కిష్టుడి పక్కలోకొచ్చి పడుకుంది పార్వతి.

హెడ్‌మాష్టరు మంచివాడు కాబట్టి సరిపోయింది. ఒంటరిగా తను యీ రాక్షసమూకమధ్య ఎంతకాలమని నిల బడగలిగేది? పురుషుడి అండలేనిది అందరిదృష్టిలో హీనురాలే. తను పునిస్త్రీ కాబట్టి తనని భర్త విడిచేశాడా? భర్తనే తను విడిచేసిందా? ఆరాతియ్యనివాళ్ళు లేరు. మెత్తగావుంటే ఎంతయినా ఏడ్పించుతారని అనుభవంమీద గ్రహించి అందరితో కఠినంగా మెలగుతుంటే గడుసు, మొండి—పొగరుమోతు, పేర్లు తగిలించి ఆనందిస్తున్నారు పరాయి వాళ్ళని అనుకోటం ఎందుకు. సాక్షాత్తు పిన్ని, తనని అర్థంచేసుకుందా? ఉత్త రాలమీద ఉత్తరాలు కురిపించింది. సంపాదన ఎంత? పైన్రివేట్లుచెపుతు న్నావా? ఎంత దాస్తున్నావు? నువ్వు ఉద్యోగం చేస్తున్నట్లు ఆతగాడికి రాశావా? అవసరం వచ్చింది. పాతిక రూపాయలు పంపు ఇలా ఉత్తరం అంతా నిండివుంటుంది నువ్వెట్లా వుంటున్నావు? పిల్లవెలా వుంటున్నారు? ఒక్క ముక్క వుండదు.

రెండుసార్లు డబ్బు పంపింది అది నేరం అయింది దాచే డబ్బులోంచి పంపు అని రాస్తుందా? ఇదంతా తన మెతక దనం వింటున్నకొద్దీ ఆడిస్తారు. అందుకే ఇహపై కానీ పంపటానికి వీలులేదంటూ రాస్తూ మరో నాలుగు ముక్కలు రాసింది. ఉండటానికో యిల్లు ఉండి ఆ యింటిమీద అద్దెలు వస్తూ వుండగా నన్ను డబ్బు పంపమనటం న్యాయం కాదు అని ఉత్తరం చదివి ఏమను కుంటుంది? దీనికి పొగరు పట్టింది అను కుంటుంది అనుకోని నలుగురితోపాటు పిన్ని, అంతేగా? నా పిల్లలు నన్నర్థం చేసుకుంటే చాలు.

కిష్టుడి తల నిమురుతూ ఆలోచిస్తూ అలాగే నిద్రపోయింది పార్వతి.

## 7

"అమ్మా! అమ్మా!" పెద్దగా కేకలు పెడుతు న్యూస్‌పేపరుతో యింట్లో అడుగు పెట్టాడు రఘు.

"అమ్మ యింట్లో లేదు. మహిళా మండలికెళ్ళింది." శకుంతల వంటింట్లోంచి బైటకు వస్తూ అంది.


నిస్పృహగా కుర్చీలో చతికిల పడ్డాడు రఘు.

"అమ్మతో ఏం పని?"

"అమ్మ వచ్చింతరువాత చెబుతాను. సీక్రెట్, అంటే తెలుసా? సరె సరె. ఎక్కిరించనక్కరలేదు అమ్మ ఉద యమే మహిళామండలికి దేనికి వెళ్ళింది?"

"సీక్రెట్. అడగరాదు" అసలే పెద్ద వయిన కళ్ళను మరింత పెద్దవిగా చేసి అంది శకుంతల

రఘు ఏదో అనబోయేలోగా న్యూస్ పేపరుతో హడావిడిగా లోపలికి వచ్చాడు కృష్ణ. కుర్చీలో కూర్చున్న అన్నయ్యను చూడలేదు. సరాసరి




శకుంతల దగ్గరకు వెళ్ళాడు. "మంచి శుభవార్త చెబుతాను, ఏమిస్తావ్ శకూ!" అన్నాడు

శకుంతలను "శకూ" అని పేరు పెట్టి పిలుస్తాడు కృష్ణ

కృష్ణ చెప్పబోయే శుభవార్త ఏమిటో రఘు గ్రహించాడు. "సువ్వేది కోరితే అది." అన్నాడు కుర్చీలోనుంచి లేస్తూ.

"హాయ్! బ్రదర్ సివిక్కడే వున్నావ్! ఫస్ట్‌క్లాస్‌లో పరీక్ష పాసయినందుకు. కంగ్రాట్యులేషన్స్." అన్నాడు కృష్ణ గిర్రున పక్కకు తిరిగి

"థాంక్యూ!" అన్నాడు రఘు

శకుంతల రివ్వున వంటగదిలోకి పరుగెత్తుకెళ్ళి పంచదార డబ్బాతో తిరిగి వచ్చింది. నోరు తెరవమని ఇద్దరి నోళ్ళలో గుప్పెడు గుప్పెడు పంచదార గుమ్మరించింది మరో గుప్పెడు పంచదార ఎత్తి నోట్లో పోసుకుంది

"చెల్లాయి కోరిక గ్రహించాను. అడగక ముందే అనుగ్రహిస్తున్నాను. నాలుగు కిలోల పంచదార చెల్లాయి ఒక్కర్తే తినటానికి సాయంత్రం లోపల తెచ్చి పడేస్తాను"

"మంచివార్త విన్నప్పుడు తీపి పెట్టాలి స్వీట్ లేదు కాబట్టి పంచదార పెట్టాను నాకేం పంచదార వద్దు పానకం వద్దు శశి కట్టుకున్న వైలెట్ కలర్ పట్టు బుటాల చీర కావాలి" శకుంతల చిరు కోపంతో అంది.

"అయ్ బాబోయ్! పట్టుచీర... వైలెట్ కలర్ పట్టుచీర! చీర ... అదీ పట్టుది, చాలా పెద్ద కోరిక. నేనేం ఉద్యోగం చేస్తున్నానా, ఊళ్ళేలు

తున్నానా! నీ కోరిక నేను ఉద్యోగంలో ప్రవేశించగానే మొదటి జీతంలో కొని తీరుస్తా, ప్రామిస్." రఘు తిరిగి కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

"పెద్ద, అక్కడికి అడగంగానే తీర్చే టట్లు ఫోజు," శకుంతల మూతి తిప్పింది.

చిలిపి పోట్లాటలు, వాళ్ళకి అలవాటే. ఓ పక్క నవ్వుతూ మరో పక్క వాదించుకుంటూ పావుగంట గడిపేశారు. అప్పటికి పార్వతి ఇల్లు చేరింది. కూడ బలుక్కున్నట్లు ముగ్గురు ఒకేసారి చెప్పేశారు పార్వతికి.

"రఘూ! పరీక్ష పాస్ అయినందుకు సంతోషపడితే చాలదు. పైకి పోవటానికి మరింత కష్టపడాలి. విజయం సాధించటం తేలిక. దానితో వచ్చే బరువు బాధ్యతలే కష్టమైనవి. వాటిని గెలవాలి. అదే నిజమైన విజయం అని ఓ సామెత వుంది..."

పార్వతి మాటలకు అడ్డు తగులుతు రఘు "అమ్మా! నే ఉద్యోగ ప్రయత్నం చేస్తాను," అన్నాడు.

పార్వతి ఉలిక్కిపడింది.

"ఇంటర్‌తో చదువు ముగిస్తావా? నీ కెందుకొచ్చింది ఆలోచన?" గద్దించి అడిగింది పార్వతి.

"నువ్వొక్కదానివి కష్టపడుతుంటే, మేమెందాకా చదవమమ్మా?"

"అందుకని చదువు మానేస్తావా? ఇంటర్ పాస్ అయితే వచ్చే ఉద్యోగం ఏమిటో తెలుసా? ఇటుకలు మోయటం. నేను కష్టపడుతున్నది మీ సుఖంకోసం కాదు. నా సుఖం కోసం."

పార్వతి అనేదేమిటో తెలియక తెల్లబోయి వింటున్నారు ముగ్గురు.

"ఇప్పుడు నేను కష్టపడితే, మీరు పెద్ద చదువులు చదివి గొప్ప ఉద్యోగాలు చేస్తు, నాకు ముసలితనంలో కష్టమంటే ఏమిటో తెలియకుండా సుఖపెడతారని..." పార్వతి నవ్వుతూ అంది.

ముగ్గురూ కూడ తల్లి నవ్వులో పాలు పంచుకున్నారు

ముందు కార్యక్రమం ఏమిటి? అంటూ కాసేపు చర్చించుకున్నారు. ఆ తరువాత...ప్రొద్దుటే మహిళామండలికి ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందో చెప్పి పార్వతి వంటగదిలో ప్రవేశించింది. వంటతోపాటు క్షీరాన్నం కూడా చేయాలనుకుంటు

"సంఘంలో గుర్తింపు ఉండాలంటే, నోరు, పదవి వుండాలి. మహిళామండలి ప్రెసిడెంటువయి గుర్తింపు. దానికి నాలుక పదును చేర్చి పులిలాంటి దానివని అనిపించుకుంటున్నావు. ఉద్యోగం ఒక్కదానివల్లా పనులు జరగవు. నిజం గ్రహించావు గానీ అమ్మా! తల పండని వయసు రాకపోయినా తలలో వెండి తీగలు చోటు చేసుకుంటున్నాయి. అకాలంలోనే వృద్ధాప్యం మీదపడబోతున్నదనీ గ్రహించటంలేదు. మేము పెద్ద

యేది ఎప్పుడు ? నిన్ను సుఖపెట్టేది ఎప్పుడమ్మా ?"

కిష్ణ తనలో తాననుకున్నాడు చదువులోకన్నా లోకానుభవం ఎక్కువగా గణించటం వల్ల

"అమ్మ మా మేలు కోరే చెబుతుంది. అమ్మ ఎలా చెబితే అలా చేస్తాను." రఘు తృప్తిగా అనుకున్నాడు.

"అమ్మకు వైలెట్ కలర్ పట్టుచీర కొనిపెడతాను. నేను ఉద్యోగం చేసేటప్పుడు. చీర చూచి అమ్మ ఎంత సంతోషిస్తుందో ?" అనుకుంది శకుంతల.

వంటగదిలోంచి పిలుపు వచ్చేదాకా ఎవరి ఆలోచనలో వారు ఉన్నారు

## 8

బి. ఎ. పాస్ అయింతరువాత రఘు ఐ. ఎ. ఎస్ పరీక్షకు కూర్చున్నాడు. ఒక్కోసారి విధి ముందు తెలివిగలవారు కూడా అపజయం పొందుతుంటారు. రఘు పని అలాగే అయింది. చీకట్లో వెలుగు రేఖలా బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది వెంటనే.

మంచి ఉద్యోగం వచ్చినందుకు పార్వతికన్నా రఘు సంతోషపడ్డాడు. ఉద్యోగం వచ్చింది కదా అని ఇంట్లో ఖర్చులు పెరగలేదు. తల్లి మాట జవదాటటం రఘుకు ఎప్పుడూ అలవాటు లేదు. కాకపోతే మొదటి జీతంలో శకుంతల కోరిక తీర్చాడు, అన్నమాట ప్రకారం వైలెట్ కలర్ పట్టుచీర కొని పెట్టి.

రఘు వుద్యోగంలో చేరిన రెండేళ్ళకు కృష్ణ ఇంటర్ సెకండ్ క్లాసులో పాస్ అయ్యాడు. ఇహ పై చదువులు చదవను. వ్యాపారం పెడతానని మొండి పట్టు పట్టి కూర్చున్నాడు.

పార్వతి కళ్ళముందు డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు గిర్రున తిరుగుతున్నారు. రఘు ఆఫీసునుంచి వచ్చింతరువాత కృష్ణ విషయం గట్టిగా మాట్లాడదామనిఎదురుచూస్తూకూర్చుంది.

రఘు వచ్చేటప్పటికి కృష్ణ కూడా వచ్చేశాడు. ఓ అరగంట ఆగి మెల్లగా విషయం కదిపింది పార్వతి.

"వ్యాపారమంటే ముందుగా డబ్బు పెట్టుబడి ఉండాలి పెట్టుబడి పెడతాము ఎరాగో అలాగా, వ్యాపారం దినదినాభివృద్ధి కావాలి కాని కాస్త నష్టం వచ్చినా చెరువుకి గండి పడినట్లే. వ్యాపారం చేయటం ఇంటా వంటాలేదు. తెలియని వాటిల్లో తల దూర్చడం మంచిదికాదు. ఇంతకన్నా పెద్ద చదువులు చదివితే నయం," అంది పార్వతి.

నీ అభిప్రాయం ఏమిటన్నట్లు తమ్ముడి వైపు చూచాడు రఘు.

"పెట్టుబడి వేలు పెట్టనక్కరలేదమ్మా ! ముందు వందలతో ప్రారంభించి లాభాన్నిబట్టి మనీ పెంచుదాము. వ్యాపారం చెయ్యడానికి లోకానుభవము, మెళుకువా వుండే చాలు. తాతలనుంచీ వారసత్వం రానక్కరలేదు. పెద్ద చదు

వులు చదివితే పెద్ద ఉద్యోగాలు వస్తాయని నమ్మకం ఏమిటి? ప్రతివారు డాక్టరు, కలెక్టరు కాలేరు. వెయ్యిమంది ప్రయత్నిస్తే సీటు వచ్చేది ఒక్కడికి. ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయిన అన్నయ్యకు ఏమి వచ్చింది? రాత్రింబవళ్ళు నీవు నూరి పోయబట్టే యీ పరీక్షయినా గట్టెక్కాను. ఇహ పై ఆ నమ్మకం కూడా లేదు. నీ ఆశీర్వాదబలం వుంటే లాయర్లు, డాక్టర్లకన్నా ఎక్కువ సంపాదిస్తాను. నేను పైకి రాలేనని నమ్మకం గట్టిగా వుంటే చెప్పమ్మా? నా ఆశ చంపుకుని నీ కోరిక తీరుస్తాను" అన్నాడు కృష్ణ.

కృష్ణ కార్యవాది. ఎదుటివారు చెప్పింది వింటూనే తన మాట నెగ్గించుకొంటాడు నేర్పు ఓర్పు సమానంగా వుంది. పైగా రఘు లాగా చవ్వ లాంటి మనిషి కాదు చురుగ్గా చూచే కళ్ళు, గంభీరమైన విగ్రహం. అందుకేనేమో, పార్వతి కూడా ఒక్కొక్కసారి వెనక్కు తగ్గుతుంది

"మాట్లాడవేమమ్మా?" అన్నాడు కృష్ణ, తల్లి మౌనం వహించటం చూచి

"నీ అభిప్రాయం ఏమిటి రఘూ?" అంది పార్వతి

తల్లి కోర్కె తమ్ముడి అభిప్రాయం తెలిసిన రఘుకి ఏం చెప్పాలో తోచ లేదు. చివరికి ... "చదువుకోటమూ మంచిదే, బిజినెస్సూ మంచిదే. దేనిలో అయినా కృషికి అదృష్టం కలిసిరావాలి." అన్నాడు నిదానంగా.

"కరెక్ట్ బ్రదర్! చక్కటి మాట శెలవిచ్చావ్! ఏమంటా వమ్మా!" రఘువైపు మెచ్చుకోలుగా చూచి వెంటనే వినయంగా తల్లి నడిగాడు కృష్ణ

"నీ యిష్టం కృష్ణా! మరో సారి ఆలోచించు," అంది పార్వతి. స్పష్టంగా కృష్ణ అభిప్రాయం తెలుస్తుంటే చదువు కోవటమే మంచిదని గట్టిగా చెప్పలేక పోయింది

అప్పటికి ఆ చర్చ కట్టిపెట్టి రఘు పెళ్ళి విషయం ఎత్తుకున్నారు

'నిన్న మహిళామండలికి వెళితే వకళమ్మ పెళ్ళి సంబంధం మాట ఎత్తింది నిన్ను కనుక్కొని చెవుతా నన్నాను" పార్వతి అంది

"ఇప్పుడు నా పెళ్ళికేం తొందరమ్మా! శకుంతలకు యిరవై ఏళ్ళు రాబోతున్నాయి ముందు దానికి చూద్దాము" తల వంచుకు చిన్నగా అన్నాడు రఘు

'శకుకి యీ ఏడుతో బి. కామ్. పూర్తి అవుతుంది. కుదిరితే పెళ్ళి లేక పోతే పై చదువు దాని పెళ్ళి చేయాలంటే కన్నెధార పోయటానికి నీ పెళ్ళయి వుండాలి" పార్వతి లోలోపల బాధపడుతు అంది.

"అహ!" అని వూరుకున్నాడు రఘు.

"బాగా డబ్బున్నవాళ్ళా?" కృష్ణ అడిగాడు.

"కొద్దో గొప్పో వున్నవాళ్ళే. పది మంది బలగం వుంది. అవసరానికి పది మందీ ఆదుకుంటారు..."

పార్వతి మాట పూర్తి చేయకముందే కృష్ణ అడ్డం తిరిగి ... "మన నెవరు ఆదుకున్నారమ్మా? పదిమంది వుండగా సరా?" అన్నాడు.

"అల్లుడిని కదా, ఏదీ కాదనరు నేరా, కృష్ణా!"

"మొత్తానికి అల్లుడి హోదా నిలుపు కొనేటట్లున్నావు అన్నయ్యా!" నవ్వుతూ అన్నాడు కృష్ణ.

"చదువుకున్నది పిల్ల బాగుంటుదిట. పిల్ల నాన్నగారు, అన్నయ్య, బ్యాంకి కొచ్చి నీకు తెలియకుండా నిన్ను చూచారట మీరు 'ఊ' అంటే పెళ్ళిచూపులు ఏర్పాటుచేస్తానని వకుళమ్మ యిప్పటికి పదిసార్లు చెప్పింది నీవు గట్టిగా వద్దంటే వకుళమ్మతో చెపుతాను"

తల్లి ముందు తండ్రిమాట ఎత్తటం ఏనాడో మరిచిపోయ్యాడు రఘు "తల్లీ తండ్రీ యీ జన్మకు కలుస్తారన్నది లేదు. తన పెళ్ళి అయితేనే శకుంతల పెళ్ళి. నిండా పాతికేళ్ళు లేకపోయినా జీవిత సహచారిణి కావాలని యీ మధ్య పదే పదే అనిపిస్తున్నది. తను పెళ్ళి చేసుకోటమే అమ్మ అభిప్రాయంకూడ." రఘు ఆలోచించాడు.

ఈ విషయంలో తన జోక్యం అనవసరం అనుకుని కృష్ణ పత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు

"నీకెలా మంచిదనిపిస్తే అలా చెయ్యమ్మా!" అన్నాడు రఘు

"వకుళమ్మతో చెబుతాను. పెళ్ళి చూపులు ఏర్పాటు చేయమని"

"అలాగే." అని కూర్చున్న చోటు నుంచి లేచాడు రఘు.

పార్వతికి మధుసూదనం గుర్తుకు వచ్చాడు

## 9

సాయంత్రం అయిదు గంటలయింది.

కృష్ణ మాటిమాటికి గుమ్మంవైపు చూస్తూ కాలు గాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు. పది నిముషాలు కాంగానే గేటువద్దకు వెళ్ళి వీధి చివరంటా చూచి చిరాకుపడుతూ యింట్లోకి వచ్చేశాడు.

మరో పావుగంటకు పార్వతి యింట్లో కాలు పెట్టింది

రాత్రి తొమ్మిది, పది గంటలకు తప్ప యింట్లోవుండని కృష్ణ యీరోజు ఇంట్లోనే వుండట చూచి ఎవంత ఆశ్చర్యం పొందింది పెరట్లోకెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కొని వంటింట్లోకి వచ్చింది. శకుంతల కనపడలేదు. ఫ్లాస్కులో చూస్తే కాఫీ వుంది వున్నకాఫీని రెండు కప్పుల్లో పోసుకుని ముందుగదిలోకి వచ్చింది పార్వతి.

"శకుంతల ఎక్కడికి వెళ్ళిందిరా

కృష్ణా?" అంది పార్వతి కాఫీకప్పు కృష్ణకు అందిస్తూ.

"స్నేహితురాలింటికి వెళ్ళివస్తానని నే రాంగానే వెళ్ళింది ఇంతకుముందే తాగాను కాఫీ. ఊ...సరేలే యివ్వు తెచ్చావుగా," అన్నాడు కృష్ణ

"పెందరాళే యింటికి వచ్చావు. పని అయిపోయిందా?"

''రోజూ వుండే పనేకదమ్మా. పెనుగ్గా వుండి వచ్చేశాను.''

కృష్ణచెప్పింది పూర్తి నిజంకాదేమో అనిపించింది పార్వతికి. ''ఊ", అని కాఫీతాగుతూ కూర్చుంది.

తల్లికి ఏదో చెప్పాలని రెండుసార్లు తల ఎత్తిచూచి ఆలోచిస్తూ కూర్చు న్నాడు కృష్ణ. ఆ సంగతి గ్రహిం చింది పార్వతి. ఏదన్నావుంటే దాచు కోడు వాడే చెబుతాడు అనుకుంది.

"అమ్మా! అన్నయ్య అత్తవారికేం తీసిపోరు శకుంతల అత్తగారి తరుపు వాళ్ళు.'' అన్నాడు కృష్ణ

"ఏం? యిప్పుడేమయింది?" అంది. ఏంజరిగిందో అని ఆత్రుతపడిపోయింది పార్వతి.

మరో రెండునెలలో శకుంతల పెళ్ళి జరగబోతున్నది. రఘు అత్తవారి తరుపు బంధువుల్లోనే సంబంధం కుది రింది. పిల్లవాడు రూపవంతుడు, గుణ వంతుడు. ఉద్యోగం చేస్తున్నాడు నెలకు ఏడువందలదాకా వస్తుంది. ఎన్నో సంబంధాలు చూచాడు. ఒక్కపిల్లా నచ్చలేదు. శకుంతల అందం పిల్ల వాడిని కట్టిపడేసింది. శకుంతలను తప్ప చేసుకోనని కూర్చున్నాడు. పిల్లవాడి పేరు శ్రీపతి.

శకుంతల, శ్రీపతి భార్యాభర్తల యితే చూడ ముచ్చటగా వుండటమేగాక ఒండొరులు సుఖపడతారని అనిపించింది, పార్వతికి. కృష్ణ బంధువులమాట ఎత్తే టప్పటికి ఆందోళన కలిగింది. ''ఏమ యిందిరా కృష్ణా?'' అంది మామూలుగా అడిగినట్లు.

"శ్రీపతి బావగారికి ఏదో చుట్టం అవుతాడట, ఇవాళ మాషాపుకి వచ్చాడు. వచ్చినవాడు ఎంతవరకో అంతవరకు వుండాలి. అధిక ప్రసంగం మొదలు పెట్టాడు. "శకుంతలకు శ్రీపతిలాటి భర్తదొరకటం మన అదృష్టంట." వెంటనే నవ్వుతూనే అన్నాను. శ్రీపతి బావగారికి మా అక్క దొరకటం మీ అదృష్టం'' అని...వెంటనే షాపులో వాళ్ళు,కష్టమర్స్ చూచేటట్లు పెద్దపెట్టున ఓ వెధవనవ్వునవ్వాడు. శ్రీపతి వైపు వేలెత్తి చూపించే ఏ వంకా లేదుట. ఆడదానివైపు వేలెత్తి చూపుతారుట కాస్త వంకవున్నా? అన్నీవున్నా ఆడపిల్లకు పెళ్ళికావటం కష్టంగావున్న రోజులుట యివి?"

ఇలా అంటుంటే ఒళ్ళుమండింది. శకుంతల అత్తారివేపు బంధువు కాబట్టి



తరిపోయింది. మరొకడయినట్లయితే మెడ పట్టుకు గెంటేవాడిని" కృష్ణ కోపంతో నొసలు ముడేసి అన్నాడు.

"ఏదో అన్నాడని అంత కోపం ఎందుకురా కృష్ణా? మనుషులంతా ఒకే విధంగా వుంటారా?"

"అక్కడితో ఆగితే ఫరవాలేదమ్మా? ఆయన ఎలా మాట్లాడాడో అచ్చం అలా చెపుతా విను. నీకే అర్థం అవుతుంది...నీ పేరేమిటన్నావ్, ఆ...కృష్ణమూర్తని కదూ.? చూడు మూర్తీ! మీ నాన్నగారు దేశాలు పట్టుకుపోయారటగా! లోకులు తలా ఓ విధంగా అంటారోయ్, అవి మనం పట్టించుకోకూడదు. ఏం జరిగిందో ఎవరికీ తెలీదుకదా? అదలా వుంచు. మీ అమ్మ నోట్లో నాలుకున్న మనిషి కాబట్టి మిమ్మల్ని యింతవాళ్ళను చేసింది. అందరాడాళ్ళకీ అది సాధ్యమా? అని...పంతులమ్మ వుద్యోగం చేస్తూ ఇంకా చదువుకుని లెక్చరర్ అయిందంటే మాటలదోయ్! మహిళామండలి ప్రెసిడెంటుట. ఆ మధ్య ఓ పెద్దమనిషి

ఏదో అన్నాడని నలుగురిలో పట్టుకు దులిపేసిందిట. అంత మొగాడూ నోరెత్తలేదుట—విడ్డూరంగా చెప్పు కుంటున్నారనుకో. ఒంటరి ఆడది మెత్తగావుంటే సమాజం అణిచి పారే స్తుంది. ఆడదానికికూడా మంచి ధైర్యం లేకపోతే లాభం లేదోయ్ మూర్తీ! అన్నట్లు పెళ్ళికూతురికి మీ అమ్మ తెలివి తేటలు ధైర్యం వచ్చాయా ? లేక మీ నాన్నగారిలా మెతక మనిషా ?" ఇదమ్మా ఆ వృద్ధజంబూకం అంది." యాక్షనుచేస్తూ చెప్పాడు కృష్ణ

పార్వతిముఖం లిప్తపాటున నల్లబడి తిరిగి మామూలు అయింది.

"ఆయన ఆ మాట అంటే నీవేమ న్నావ్ కృష్ణా ?' పార్వతి గంభీర్యంగా అడిగింది.

"భూమ్మీద నూకలున్నాయి కాబట్టి బతికిపోయాడు. నవ్వుతూనే అంటిం చాను. "నక్కజిత్తులవారి తోకలు కోయటానికి మా అమ్మలాంటివారు నూటి కొకరైనా పుట్టాలి. లేకపోతే యీ మగజాతి ఆగడాలకు అంతువుండదు. నాన్నగారిని ఎప్పుడు చూచారండీ ? మీలాంటి సహృదయుల పొద ఆయనకు తొత్తిగా గిట్టదే, మీకూ ఆయనకూ దోస్తీ అయిందంటే అర్థం మీరు..నేననుకుం టున్నట్లు సహృద...పోనీలెండి నా అభి ప్రాయంతో పనేమిటి ? అరే...లేస్తు న్నారు వెళతారా ? మాటలతో ఆలశ్యం అయిపోయినట్లుంది" అన్నాను అంతే. మహానుభావుడు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు." పెద్దపెట్టున నవ్వుతూ ముగించాడు కృష్ణ. 'వృద్ధజంబూకం వెళ్ళేటప్పుడు ముఖకవళికలు గుర్తొ చ్చాయి.

కృష్ణ స్వరంమార్చి యాక్షనుచేసి చెపుతుంటే పార్వతికి నవ్వువచ్చింది.

"పోనీలేరా కృష్ణా! నన్నపార్థం చేసు కున్న వారిలో మరోమనిషి అంతేనా ?" అంది పార్వతి. కృష్ణ చెప్పింది తేలికగా తీసిపారేసి.

"నువ్వేమంటున్నావో, నీ మనసులో వుందేమిటో అర్థంచేసుకోటం నా తరం కావటం లేదమ్మా ? ఎదుటి మనిషి చిన్న మాటఅంటే చిన్న పొరపాటు చేస్తే వారు తప్పు ఒప్పుకొనేదాకా వదలవే. యీ నక్క యిన్ని మాటలంటే చీమ కుట్టినట్లయినాలేదా ? అన్నయ్య అత్త వారి తరుపువారూ అంతే. పిల్లిమీద పెట్టి బల్లిమీద పెట్టి ఏదో ఒకటి అనటమే. అన్నయ్య అత్తగారికయితే కొమ్ము లొక్కటే తక్కువ. ఎందుకు పడాలి అనవసరం మాటలు ?''

"కృష్ణా ! నీకు ఆవేశం ఎక్కువ. లోకులు ఏదో అన్నారని ఎదురు తిరిగి అంటే చాటుగా అనుకుంటారు. మనం చేసేదేంలేదు. వదిన ఒక్కతే మనపిల్ల. అదృష్టంకొద్దీ మంచిపిల్ల దొరికింది. మనలో కలిసిపోయింది, అంతే చాలు.

నా సంగతి అంటావ్ ?.. మొదట్లో ఎవరేమంటారోఅని కూర్చోటానికి నుంచోటానికి భయపడ్డాను అనుభవాలు పాఠాలు కాగా శిలలా మారిపోయాను చూచే వాళ్ళకు బండరాయిలా కనిపిస్తున్నాను. ఇప్పుడు ఎవరికీ భయపడి తలవంచను కాబట్టి.. ఎవరో ఏదో అంటారని. అనుకుంటారని భయపడేరోజు ఎప్పుడో పోయింది అనింటికీ నవ్వటం ఒకటే అలవాటయిపోయింది " చిరునవ్వుతో అంది పార్వతి.

''ఏదయినా అంటే నేనవ్వను. దావ చితక బాత్తాను " ఆవేశంగా అన్నాను కృష్ణ

"మరి . ఆ జంబూకాన్ని ఎందుకు వదలేశావ్ ? గోలజరిగి అక్కపెళ్ళి చెడిపోతుందనా ? అమ్మ ఏమయినా అనుకుంటుందనా ? నువ్వెందుకు ఆయన్ని వదిలేశావో, అలాగే మీకోసం నేను లోకులను క్షమించి వదిలేశాను '' అదే చిరునవ్వుతో అంది పార్వతి

"నీతో వాదించటం కష్టం అమ్మా !"

పార్వతి మాట్లాడలేదు. నవ్వి వూరుకుంది

"నే యింటికి వచ్చేటప్పటికి శకుంతల ఒక్కతే వుంది. అన్నయ్య వదిన సినిమాకు వెళ్ళారు. వాళ్ళిద్దరూ వెళ్ళకపోతే శకుంతలనుకూడా తీసుకెళ్ళకూడదూ ?" కాసేపాగి కృష్ణ అన్నాడు.

"కొత్తగాబట్టి జంటగా వెళ్ళాలని వుంటుంది. పొద్దుట సినిమా మాట ఎత్తి శకూని తీసుకెళ్తానన్నారు. నేనే వద్దన్నాను.

"పెళ్ళయి ఏడాదిదాటి రెండోఏడు సగం పడింది ...లోలోపల గొణుక్కొని పైకి ''నే అయితే శకూని తీసుకొనికాని వెళ్ళను " అన్నాడు కృష్ణ

"ఒక్కోసారి నువ్వు మాట్లాడే దానిలో అర్థం వుండదురా కృష్ణా ! ఒకే కోణంనుంచి చూస్తావు " అని వూరుకుంది పార్వతి

స్నేహితురాలింటికి వెళ్ళిన శకుంతల వచ్చింది ఏదో మాట్లాడుదామని నోరు తెరిచిన కృష్ణ రప్పున నోరు మూసుకున్నాడు.

అమ్మ, తమ్ముడు మధ్య దేని గురించో తీవ్ర సంభాషణ జరిగి వుంటుదని శకుంతల, వారి ముఖ కవళికలు చూచి గ్రహించింది. "ఎంతసేపయిందమ్మా! వచ్చి ?" అని లోపలికి వెళ్ళింది చేతిలోవున్న పుస్తకాలు పెట్టి రావటానికి

"అలావెళ్ళి వస్తానమ్మా ?" అని కృష్ణ బైటకు వెళ్ళిపోయాడు.

దీపాలు పెట్టే వేళయిందనుకుంటూ కూర్చున్న చోటునుంచి పార్వతి లేచింది

## 10

"రాత్రికి వస్తావా ? అక్కడే పడుకుంటావా రఘూ?"అద్దంముందునుంచుని

తల దువ్వుకుంటున్న రఘుని అడిగింది పార్వతి.

"భోజనాలయేటప్పటికి పది అవుతుంది రేపు ఆదివారం. ఏకంగా రేపు రాత్రికి వస్తాను. రాధ కిందటిసారి వెళ్ళినప్పుడు పదిసార్లు చెప్పింది. ఓ రోజు వుండేటట్లు రమ్మని." క్రాపు దువ్వుకోటం అయింది. పౌడరు రాచుకుంటూ అన్నాడు రఘు.

పార్వతి మాట్లాడలేదు

"నాతో ఏమన్నా పని వుందా అమ్మా?" అన్నాడు కాసేపు ఆగి తల్లి ఏమీ అనకపోవటం గ్రహించిన రఘు.

"ఉహూ!" ముక్తసరిగా అంది పార్వతి.

టాయిలెట్ అయి వెళ్ళబోతూ... కృష్ణను పెందరాళే యింటికి రమ్మన్నాను. వస్తాన్నాడు కోడలితో ఏం చెప్పమన్నావ్ అమ్మా?" అని అడిగాడు రఘు

"ఆరోగ్యం జాగ్రత్తని చెప్పు. మందులు శ్రద్ధగా తీసుకోమని చెప్పు వీలయితే పైవారం వచ్చి రాధను చూస్తాను." అంది పార్వతి

అలాగే అని తలవూపి రఘు వెళ్ళిపోయాడు.

రఘు అత్తవారిల్లు మరో పేటలో వుంది. రాధకు నాలుగో నెలలో ఎబార్షను అయింది. ఎబార్షను అయికూడా రెండు నెలలు కావచ్చింది

అటు ఇటూ పసిపిల్లలకోసం ఆరాట పడుతుండే తరుణంలో రాధకు కడుపు రావటం అందరికీ ఆనందదాయకం అయింది పండక్కి పుట్టింటికి వెళ్ళటం అనుకోనివిధంగా రాధకు ఎబార్షను జరిగిం. ప్రస్తుతం జరిగిందానికి ఎవరూ అంతగా చింతించటంలేదు రాధ చాలా నీరసంగావుంది. ఆరోగ్యంగురించి బాధ పడుతున్నారు. తరుచు రాధను చూచి వస్తున్నాడు రఘు. ఒక్కోరోజు అక్కడే భోంచేసి రాత్రికి వుండి మర్నాడు వుదయం యింటికి వస్తున్నాడు. రాధను వెళ్ళి చూచిరావచ్చు గాని, అక్కడే భోంచేసి రాత్రిళ్ళు వుండటం పార్వతికి నచ్చలేదు. చెపితే రఘు బాధపటతాడని వూరుకుందిపార్వతి. రఘు వెళ్ళింతరువాత యిదే ఆలోచిస్తూకూర్చుంది చాలా సేపు.

"అత్తవారింట్లో అల్లుడు ఎంతవరకుండాలో అంతవరకుండేనే బాగుంటుంది చీటికి మాటికి అక్కడికి భోజనాని కెళితే ఏంబాగుంటుంది? చూచాయగా హెచ్చరించినా రఘూకు అర్థం కామ అదే కృష్ణ అయితే చెప్పే అవసరంలేదు. చూచి గ్రహిస్తాడు." అనుకుంది పార్వతి. అన్నం మాడువాసన కొట్టడంతో లేచి వంటగదిలోకి వెళ్ళింది.


వంటగదిలో చిన్నగిన్నెలో పెట్టిన పాలు వలకపోసి కళ్ళుమూసుకు తెరుస్తు నాకుతున్నది పిల్లి అడుగుల చప్పుడు విని చెంగున అవతలికి దూకి పారి

పోయింది ఇంకా సగంపాలు నేలమీద అలాగే వున్నాయి

"ఛీ.. ఛీ . పాడువిల్లి రోజూ ఏదో ఒకటి నాశనం చేస్తున్నది తన మతి మరుపు దానికి ఆహారం నమకూరుస్తున్నది. మతి మరుపు వచ్చేసింది. తల సగం నెరిసింది. అప్పుడే ముసలిదాన్నయి పోయానా ?" చిన్నగా నవ్వుకుంది తన ఆలోచనకి. అన్నందింపేసి చారుగిన్నె, స్టవ్‌మీద ఎక్కించింది. పాలు పడ్డచోట శుభ్రంగా కడిగి స్నానానికెళ్ళింది పార్వతి స్నానంచేసివచ్చేటప్పటికి చారుకాగింది చారుదింపి వంటింట్లోంచి బైటపడింది అన్నంలోకి కూర వున్నా లేకపోయినా చారువుంటే చాలు కృష్ణకు,

వంట అయిపోవటంతో ఏంచేయాలో తోచక ఎక్కడికక్కడ శుభ్రంగా నర్ది వున్న సామానుని తిరిగి సర్దిపెట్టింది. కాసేపటికి ఆవసీ అయింది పెత్తనాలు అలవాటు లేనందున కృష్ణకోసం ఎదురు చూస్తు పడకుర్చీలో పడుకుంది.

"శకుంతల కాపుర్రానికెళ్ళి ఏడాది కావస్తున్నది. రఘునికాని కృష్ణకాని పంపి శ్రీపతిన్ని. శకుంతలను పండక్కి రమ్మనాలి. ప్రయాణానికి సిద్ధంగావుండమని ముందుగా వుత్తరంరాస్తే సరి. అక్కడ శకుంతల యిక్కడ వీళ్ళు హాయిగావుంటే మధ్యలో రాధకు ఎబార్షను కావటం.




పెద్ద పదవులు కాకపోయినా బ్యాంకిలో పని రఘు కి బాగానే వుంది శ్రీపతికూడ మంచివాడు దొరికాడు. కృష్ణ కార్యశూరుడు. వాడి బిజినెస్ దిన దినాభివృద్ధి అవుతున్నది. కృష్ణకు పెళ్ళి అయితే తన బాధ్యత తీరిపోతుంది. పెళ్ళి చేసుకోరా ! అంటే "ఇప్పుడేం

తొందరమ్మా ? మెడకో గుదిబండను తగిలిస్తానంటావు. నే సుఖంగా వుండటం నీకు సంతోషంగా లేనట్లుంది ?'' అంటాడు. అక్కడికి తనదేతప్పయినట్లు నిష్ఠూరంగా మాట్లాడుతాడు చెట్టంత కొడుకుని ఏమని దండిస్తుంది ?

"అమ్మా !" గుమ్మంబైట నుంచుని కృష్ణ పిలవటంతో చటుక్కున కుర్చీ లోంచి లేచింది పార్వతి.

మరోసారి... "అమ్మా ?" అన్నాడు కృష్ణ.

వచ్చినవాడు సరాసరి లోపలికి రాకుండా గుమ్మం అవతలనుంచుని పిలవటం ..పార్వతికి ఆశ్చర్యముఆందోళన ఏకకాలంలో కలిగాయి "లోపలికి రారా, కృష్ణా !'' అంది నుంచున్న చోటునుంచి కదలకుండ.

"లోపలికి పద సుధా !'' అంటూ కృష్ణ గుమ్మందాటి పార్వతిదగ్గరకు వచ్చాడు. కృష్ణ వెనుకనే దాదాపు పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తలవంచుకుబితుకు బితుకు మంటూ వచ్చింది.

కృష్ణ విశాలమైన ఛాతీతో ఎత్తు, లావు భారిమనిషి, కృష్ణతో వచ్చిన అమ్మాయి. పొట్టీ పొడుగుగాని మధ్య రకం పాలుకారుతున్న మోము. లతలా వుంది. ఆ అమ్మాయిని కృష్ణ పక్క చూస్తుంటే మరీ సన్నగా నాజూగ్గా అని పిస్తున్నది.

పార్వతి ఇరువురిని మార్చి మార్చి చూస్తు ... కృష్ణకు ఆ అమ్మాయిని "సుధా !" అని పేరుపెట్టి పిలిచేటంత చనువు ఎలావచ్చిందా అని ఆలోచిస్తున్నది.

"ఈ అమ్మాయి పేరు సుధారాణి అమ్మా !'' అన్నాడు కృష్ణ.

"ఊ," కొట్టి వూరుకొంది పార్వతి.

"సుధ మనయింట్లో వుంటుందమ్మా నీకేమయినా అభ్యంతరమా? సుధఎవరో ఏమిటో ? ఎందుకు వచ్చిందో వివరం చెప్పుతాను. ముందు భోజనంచేద్దాము." ఎవరో తరుముతున్నట్లు గబగబ చెప్పాడు కృష్ణ

పార్వతి అన్నింటికీ... ఊకొట్టడం మినహా ఏమీ అనలేదు.

"నామీద- నే చేసేపనిమీద నీకు నమ్మకం వుందికదమ్మా ?" అని కృష్ణ అనటంతో తెలివితెచ్చుకుంది పార్వతి. 'నీపేరేమిమిటి?' అంది సుధారాణితో.

"సుధారాణి అండీ !" అంది సుధ నమ్రతగ.

సుధ స్వరం కోటి వీణలు మారు మ్రోగినట్లుంటుదని గ్ర హిం చిం ది, పార్వతి.

"స్నానంచేసిరా కృష్ణా ! భోంచేద్దాము. లోపలికి వెళదాం రా సుధా" అంది పార్వతి. ఇప్పటికిప్పుడు నిలబెట్టి అడగవలసింది ఏమీలేదు కృష్ణ చెప్ప బోయేది ఆనక వినటం తప్ప . పరాయి



పిల్లముండు, జరిగింది ఏమిటో తెలియకుండా అర్థంలేని ప్రశ్నలేసి వేధించటం కూడా తప్పు తనపెద్దరికానికే ముప్పు అనుకుంది.

"మా అమ్మలాంటి దేవత మరొకరుండరని చెప్పాను. గుర్తుందా సుధా?" కృష్ణ మెల్లిగా అంటే "అవునండీ అందరికీ మీ అమ్మలాంటి వుత్తమురాలు తల్లిగా దొరకదు." అంతకన్నా మెల్లిగా అంది సుధ.

వాళ్ళెంత చిన్నగా మాట్లాడుతున్నా పార్వతికి వినపడకపోలేదు. "నూతన అధ్యాయం మొదలైందా?" అనుకుంది పార్వతి.

## 11

చి॥ ల॥ సౌ॥ శకుంతలకు

మీ అమ్మ దీవించి వ్రాయునది. కార్డుతప్ప వ్రాయని నేను కవరు దానిలో వ్రాసిన అరడజను కాగితాలు చూచి... ఇది వ్రాసింది అమ్మేనా! అని ఆశ్చర్య పోతున్నావా? మరి...ఇక్కడ జరిగిన సంఘటనలు చూచినట్లయితే నీకూ ఆశ్చర్యం కలగక తప్పదు.

ఈ వూళ్ళోనే పాండురంగంగారని హెడ్‌మాష్టరు వున్నారు. ఐహం కుటుంబీకుడు. వారి పెద్ద అమ్మాయి సుధా రాణి పీ॥ డిష్టమా పాస్‌అయింది. చక్కని కంఠము యీ వూళ్ళోనే అక్కడక్కడ పాటకచ్చేరీలు చేసిందిట. కృష్ణ చాలాసార్లు సుధగానం విన్నాడుట. అప్పుడు వారిరువురికీ పరిచయం అయింది. సుధ వాళ్ళ వాళ్ళతో చెప్పి కృష్ణ నాతో చెప్పి వివాహం చేసుకుందామనుకున్నారట ఓరోజు కృష్ణ సుధ మాట్లాడుకోవటం సుధ నాన్నగారి దృష్టిలో పడింది. చివాట్లుపెట్టి సుధను యింటికి తీసుకెళ్ళారట

వాళ్ళ వాళ్ళు పెళ్ళికి అభ్యంతరం చెప్పాల్సిందే కాని అమ్మ దేనికీ అడ్డు చెప్పదు, నీతిమాలిన పనిచేస్తే తప్ప. తెలిసిన అమ్మాయిని పెద్దల అనుమతితో పెళ్ళిచేసుకోటం నేరంకాదని తెలిసి, సరాసరి కృష్ణ వాళ్ళింటికి వెళ్ళాడుట. వెళ్ళి . "మాఅన్న కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాడు నేను కట్నం తీసుకోను. నమ్మించి మోసగించేరకాన్ని కాదు వాండొరులం యిష్టపడ్డాము. మీరు ఊఅంటే మా అమ్మగారిని తీసుకు వస్తాను." అని చెప్పాడుట

అప్పుడు వాళ్ళేమన్నారో తెలుసా శకూ! బహుశా నీ వూహకు అందదేమో? నేను వాళ్ళకు తెలుసుట. వాళ్ళేమన్నదీ వివరం రాసే బదులు రెండు ముక్కల్లో రాస్తాను." ఓహో! ఆ తల్లి కన్నబిడ్డవా? అలా చెప్పు. పోలిక లెక్కకి సౌతాయి! మా యింటా వంటా లేదు. ప్రేమలు పెళ్ళిళ్ళు." అంటూ నాలుగు దులిపారుట. కృష్ణది వూరుకొనే తత్వంకాదు. తననవలసింది అని వచ్చేశాడుట నాలుగురోజుల తరువాత ఎలా పోస్ట్ చేయగలిగిందోగాని సుధ వద్దనుంచి కృష్ణకు లెటర్ వచ్చింది... తనని మేనమామకిచ్చి పెళ్ళి చేయటానికి ముహూర్తాలు పెట్టబోతున్నారుట. నా పెళ్ళి చేసుకోటానికి నాకు హక్కు వుంది. మైనరు తీరింది ఫలానారోజు నీకోసం ఎదురుచూస్తుంటాను. నన్ను తీసుకెళ్ళు. లేకపోతే యీ లోకంనుంచే శలవుతీసుకుంటాను." అని.

మధ్యాన్నం షాపుకి లెటర్ వచ్చిందిట. రెండు రోజులక్రితం అందవలసింది, ఆ రోజు అందింది. షాపునుంచి అటే వెళ్ళి సుధను వెంటపెట్టుకొచ్చాడు కృష్ణ.

కృష్ణ చెప్పింది విన్నతరువాత మందలించలేకపోయాను. అలా అని పూరుకోలేదు. "ప్రేమ గుడ్డిది. మగవాడిని నమ్మి ఆడది వంటరిగా బైటకు రాకూడదు." అని సుధతో అంటే ఏమందో తెలుసా ? "ఆయన వ్యక్తిత్వం అవగాహన చేసుకునే బైట కాలు పెట్టాను'' అంది

"రుక్మిణి రాయబారం పంపితేనే కదమ్మా. శ్రీకృష్ణుడు కదిలి వెళ్ళింది." అన్నాడు కృష్ణ

కృష్ణ, సుధలలాంటి ప్రేమికులు ఎందరో వుండవచ్చు. కాని ... కార్యాచరణకు వస్తే అందరూ వెనకడుగు వేసేవారే, యిరువురిలో ఒకరు మోసకారులయితే రెండోవారి భవిష్యత్తు అంధకారమే కదా ?

సుధ నాన్నగారు మరికొందరు వచ్చి పోట్లాడారు. రిజిష్టర్ మేరేజి చేసుకున్నామని కృష్ణ దబాయించాడు. అక్కడితో కాస్త తగ్గారు యీమధ్య ఆడవాళ్ళు మాత్రం చాటుగావచ్చి చూచి వెళ్ళారు.

ఎవరెట్లాంటి వారయినా సుధ చాలా మంచి పిల్ల. కృష్ణ ఎన్నిక సరిఅయినది. పరిస్థితులు చక్కపడిం తరువాత నలుగురి ఎదుట కృష్ణ, సుధల వివాహం జరుగుతుంది. ఆ రోజువరకు ఆగుతామన్నారు. సుధ మనింట్లోనేవుంది రఘు, రాధ కూడ సుధంటే యిష్టం చూపుతున్నారు. "మామగారిచేత కాళ్ళు తరువాత కడుగించుకోవచ్చు. రిజిష్టర్ మేరేజీ ముందు చేసుకోవటం మంచిది!" అని రఘు అన్నాడు. ఇదే విషయం కృష్ణ ఆలోచిస్తున్నాడు.

పరిస్థితులు చక్కబడుతున్నాయి. అనుకుంటూ వుండగా కనీ వినీ ఎరుగని మరో సంఘటన జరిగింది. అది మీ నాన్నగారి రాక...

ఆశ్చర్యపోతున్నావా శకూ ? ఏది మంచికి జరుగుతున్నదో ? ఏది చెడుకి జరగనున్నదో ? ముందు యింకేం జరగనున్నదో ? విధికి తల వంచాల్సిందే తప్ప కాలానికి ఎదురీది నిలిచే శక్తి నాతో నశించింది ఇంతకాలమూ యీ సంసారం నడిపింది నేనా ? అనుకుంటే, నిజమా ? అనిపిస్తున్నది.

"పార్వతికి నోట్లో నాలుకలేదు. పార్వతి చాలా మంచిపిల్ల. ఓ మాట అన్నా తనను కాదన్నట్లు పోతుంది. పార్వతి యీ కాలం పిల్లకాదు. భయస్తురాలు. తెలిసినవారందరూ నాగురించి ఓ నాడుయివేమాటలన్నారు. పిల్లలభవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని నా కాళ్ళమీద నే నిలబడితే, లోకందృష్టిలో గడుసుదాన్ని, అన్నింటికీ తెగించిన మొగరాయుణ్ణి అయాను.

మగవాడి అండలేని ఆడది సచ్ఛరితురాలయినా అపవాదులకు లోటు వుండదు. అంతేకాదు. అణగతొక్క

టానికి చూస్తారు. లొంగనప్పుడే ఎన్ని పేర్లయినా వచ్చేది. అనుభవంలో గ్రహించిన సత్యం యిది.

జీవిత పోరాటంలో గెలుపు నాదే అయినా అలసిపోయాను శకూ! దేహము మనసు విశ్రాంతి కోరుతున్నాయి. ఇదే సమయంలో నాన్నగారు వచ్చారు. పిన్ని వద్దకు వెళ్ళి ఎడ్రస్ కనుగొని వెతుక్కుంటు నాకోసం వచ్చారు.

"పార్వతీ! నీకు తీరని అన్యాయం చేశాను పిల్లలపట్ల తండ్రిగా నా ధర్మం నిర్వర్తించకుండా ముఖం తప్పించాను. గాలిలో తిరగటం అలవాటు అయి నాటక సమాజమే నా ఊపిరి, ప్రాణం, అందుకే జన్మ ఎత్తానని మురిసిపోయ్యాను. సంసారము బరువు బాధ్యతలు కొద్దిగా అన్నా గుర్తెరిగిన వాడినయితే నా జీవితం మరో విధంగా వుండేది

నాటకాల్లో నాయకుడిగా వేషం వేస్తున్న రోజుల్లో, నిజజీవితంలో కూడా రాజకుమారుడిలా బ్రతికాను. అఖండ కీర్తి గౌరవాలు, వాటితో అంధుడిని అయ్యాను

కొత్త నాటకసమాజాలు వెలిశాయి కొత్త పద్ధతులు ప్రవేశించాయి సరికొత్త నటులు పెరిగిపొయ్యారు మేమేస్తున్న ప్రతి నాటకం ఘోరంగా దెబ్బతిన్నాయి. మాలో మాకు చీలికలు ఏర్పడ్డాయి. ఎవరి దోవ వారు చూచుకున్నారు ఒంటరిగా మిగిలిపొయ్యాను ఇంటికి రావటానికి ముఖం చెల్లలేదు. దేశంమీద పడ్డాను నాటక సమాజంలో తప్ప నిజ సమాజంలో జీవించటం చేతగాని నేను పిడికెడు మెతుకులకోసం నరకం చవి చూచాను ఏమీ చేయలేక నీవున్నావను కుంటూ వచ్చాను పార్వతీ! దేహీ అంటూ నీ పంచ చేరాను నీ నిర్ణయం ఏదయినా సంతోషంగా స్వీకరిస్తాను"

అంటూ... మీ నాన్నగారు అతిదీనంగా అంటుంటే ఆ సమయంలో ఏం చేయాలి? నీవే చెప్పు శకూ!


"నీ దోవ నీవే చూచుకో అన్నప్పుడే మీ పార్వతి మరణించింది" అని చెప్పాలా? "ఇప్పటికయినా భార్యాపిల్లలు గుర్తొచ్చారు నా పూర్వజన్మ సుకృతం" అని సంతోషపడాలా?

"ఆయన్ని యింట్లోకి రానిస్తే యీ గుమ్మం తొక్కను. ఆయన భార్యాబిడ్డలమీద అపేక్షతో రాలేదు. తనకి జరుగుబాటు చూచుకోటానికి వచ్చాడు." శాంతంగావుండే రఘు రౌద్రమూర్తిఅయి అన్నమాట యిది

"నీకు చెప్పవలసినంతటి వాడిని కాదమ్మా! నీవేం చేసినా తగిన కారణం వుండే చేస్తావు.నీ యిష్టమే నా యిష్టం," అన్నాడు కృష్ణ, ఆవేశానికి ప్రతినిధి అణకువగా మారి

నేను మరో విధంగా ఆలోచించాను

భార్యాభర్తల మధ్య బంధం తెంచుకుంటే తెగేదా? పైపై బంధం కన్నా...




అంతర్బంధం బలీయమైందికదా? నువ్వు నా పిల్లలకు తండ్రివికాదని అనగలవా? వారి శరీరంలో ప్రవహిస్తున్నది ఎవరి రక్తం రక్తసంబంధం తెంపినా తెగుతుందా? పిచ్చో మంచో యిలాటి ప్రశ్నలు ఎన్నో వేధించాయి భార్యాభర్తల గురించి మరొకటి ఆలోచించాను భార్యాభర్తలు విధివల్లకాని, సమాజం వలనగాని, వారిలో వారికి పొరపొచ్చాలొచ్చిగాని, విడిపోతారు అలావుండగా భార్య చనిపోయిందని కబురు భర్త అందుకుంటే, ఓ కన్నీటిబొట్టు రాల్చవచ్చు పోతేపోయిందిలే అది ఏనాడో చచ్చింది నా దృష్టిలో. అనుకోవచ్చు. కాని... భర్త మరణించినట్లు భార్యకు వార్త వస్తే, ఆమె చింతించినా చింతించక పోయినా వారిరువురి పెళ్ళినాటి బంధం విడదీసి విధవను చేస్తారు

భార్యాభర్తలంటే పెళ్ళినాటి బంధం కాదు అది జన్మజన్మల అనుబంధం. అన్నింటికన్నా అంతరబంధం బలీయమైనది అందుకే మీ నాన్నగారిని వెళ్ళమనలేక పోయాను

"ఓ ప్రయోజనం ఆశించి మిమ్మల్ని వుండమనటంలేదు నే జీవించి వున్నంత వరకూ మీరు ఆకలితో అలమటించే పని లేదు పార్వతి పిచ్చిది అని నమ్మి వచ్చారు మీ నమ్మకాన్ని వమ్ము కానీయను." అని చెప్పాను

మురికి ఓడుతు చిరిగిన బట్టలతో గడ్డం పెరిగి లోతుకుపోయిన కళ్ళు, పీక్కుపోయిన దవడలు మీ నాన్నగారిని చూచి యీ పిచ్చి పార్వతి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు వచ్చాయి. శకూ! నీకు మీ అమ్మ తెలుసుగాని ఆమెలో వుండే పిచ్చిపార్వతి తెలియదు

నాన్నగారిని యింట్లోకి రానిచ్చి నందుకు రఘుకి కోపంవచ్చి తన మకాం అత్తవారింట్లో పెట్టాడు నామీద కాదు కోపం, నాన్నగారి మీదట... కోపం చల్లారాక రఘు వస్తాడని నమ్మకం వుంది. రఘు కోపం చితుకుల మంట లాంటిది కృష్ణమటుకు నాన్నగారు పలక రించబోతే కయ్యిమని ఇంతెత్తున లేస్తు న్నాడు మొన్నటికి మొన్న...

"చీటికీ మాటికీ నన్ను పలకరించ కండి. అమ్మకు మీరు చేసిన అన్యాయం, అమ్మ మీవల్ల ఏం పోగొట్టుకుంది, గతం ముళ్ళకంపలాటి గతం తానయితే మరచి పోయింది గాని, నేను మరవటం అసాధ్యం. యీ మాట గుర్తుంచుకుని మరోసారి నన్ను పలకరించే ప్రయత్నం చేయకండి "నీ భర్త ఎక్కడ?" అమ్మ ప్రతిక్షణం చుట్టుపట్లవారికి జవాబు చెప్పలేక నవనీతంలాంటి తన మనసుని కఠినశిలగా మార్చుకుని కాకులు లాటి యీ సమాజంలో కఠిన హృదయు రాలిగా ఇంకా ఘోరమైన మాటలు పడుతూ బ్రతికింది, మమ్మల్ని బ్రతికిం చింది

"నీకు నాన్న వున్నాడా?" "మీ అమ్మ గయ్యాళి అయితే మీ నాన్న సన్యాసుల్లో కలిసిపోయ్యాడా?" "ఎప్పుడూ రారా మీ నాన్నగారు మీ వద్దకు?" నన్ను నిలబెట్టి ఆరాలు తీసే వాళ్ళు కాస్త నాకన్నా పెద్ద దగ్గరనుంచి ముసలి ముతకవరకు

ఈ బాధ మీకు తెలియదు అదృష్ట వంతులు, అలాగే గడిపేయండి, మా గురించి ఆరాలెందుకు? మంచికా? చెడ్డకా? విచారించటానికా? నవ్వటానికా? అంతావిని ఏంచేస్తారు?"

ఆవేశంతో గబగబ నాలుగు అని అవతలికి వెళ్ళిపోయాడు కృష్ణ

మీ నాన్నగారి కళ్ళల్లో తడి గమ నించకపోలేదు, అక్కడే వున్న నేను. చేసేది ఏముంది?

ఇప్పుడిప్పుడే కృష్ణలో ఏదో మార్పు చూస్తున్నాను. ఆయనపట్ల "పాపం" అనే జాలి కావచ్చు

ఇన్నేళ్ళ తరువాత ఆయన తిరిగి రావటం లోకులకు విడ్డూరంగా వుంది అనేకన్నా, నేనెట్లా ఇంట్లోకి రానిచ్చానా అని అంటే వాళ్ళ విడూరానికి అర్థం వుంటుందేమో?"

జరిగిందంతా రాశాను మిగిలింది అర్థంచేసుకో శకూ! ఆలోచింపలేదు జరగబోయే మంచీ చెడూ గురించి. ఆ నిమిషాన మనసుకి తోచింది చేశాను

నన్నర్థం చేసుకోగల శక్తి నీకుంది. అందుకే వివరంగా ఇంత కథా రాశాను.

పండక్కి పిలవటానికి కృష్ణ బయలు దేరి వస్తున్నాడు నీవూ, శ్రీపతి తప్పక రావలసింది శ్రీపతిని అడిగానని చెప్పు.

ఇట్లు
పార్వతి

సుదీర్ఘమైన లేఖ రాయటం ముగించి సంతకం పెట్టింది పార్వతి

రెండు నిమిషాల క్రితం వచ్చి గుమ్మంలో నిలిచిపోయిన కృష్ణ "అమ్మా!" అన్నాడు

పార్వతి తలఎత్తి చూచింది కృష్ణ తనవైపు రాసిన కాగితాలవైపు మార్చి మార్చి చూడటం గమనించింది "ఎంత సేపయిందిరా కృష్ణా! నీ వొచ్చి" అంది, చేతిలో వున్న కాగితాలు మడుస్తు

"రెండునిమిషాలు కూడా అయి వుండదు మనిషి వచ్చిన అలికిడే గమనించకుండా అంతగా రాసింది ఏమిటమ్మా? కథ కాదు కదా! ఇప్పుడు ఇంటింటా ఓ రచయిత్రి వెలుస్తున్నది మనింట్లోమటుకు ఆ లోటు ఎందుకుండాలని రచనలు చేస్తున్నావా ఏమిటి? మా అమ్మే ఓ రచయిత్రి అయితే యీ రచయిత్రులంతా..."

"ఆపరా వేళాకోళం ఏం నే మటుకు రచయిత్రి కాకూడదా? రాయతగనా?" కృష్ణ మాటలకు అడ్డువచ్చి నవ్వుతూ అంది పార్వతి

"నువ్వు చరయిత్రివయితే కథల గురించి ఆలోచించే పనిలేదు, ముందుగా మన కథ రాయొచ్చు"

పార్వతి పేలవంగా నవ్వి వూరుకుంది

"ఏమిటమ్మా! అన్ని కాగితాలు రాసావు?" కాసేపాగి కృష్ణ అడిగాడు

"ఇక్కడ జరిగినదంతా శకుంతలకు రాశాను జరిగింది నీకు తెలుసు, నాకు తెలుసు, రఘుకి తెలుసు. మన శకుకేనా తెలియంది. అందుకే వివరంగా అంతా రాశి పండక్కిపిలవటానికి నీవొస్తున్నట్లు కూడా రాసాను."

"మంచిపని చేశావమ్మా! రాస్తే బాగుంటుందని నాకూ తోచింది నీతో చెబుదామనుకుంటూ వుండగానే ఆపని నీవే పూర్తిచేసావు"

"నాకు తెలుసు కృష్ణా! నీగురించి నా అంచనా ఏ విషయంలోనూ పొరపాటుండదు, అనుకుంది పార్వతి"

"ఇప్పుడే పోస్ట్‌చేసి రానా?"

"వద్దు సాయంత్రం నే బజారు వెళ్ళాలి అప్పుడు పోస్ట్ చేస్తాను." కాగితాలు మడత పెడుతూ అంది పార్వతి

తల వూపి కృష్ణ గదిలోకి వెళ్ళాడు.

"నా బిడ్డలు రత్నాలు" అనుకుంది పార్వతి

(సశేషం)